
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 11.03.2016, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 41 పేజీలు : 12, వెల : ₹ 5



Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
ISO 9001-2008
CARE SUPER SPECIALITY DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For State Government, APSPDCL & SHAR Employees


# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# లీడరా? డిక్టేటరా?

మేం అధికారంలో ఉన్నాం... ఈ రాష్ట్రం మా ఇష్టారాజ్యం... భూములు కొల్లగొడతాం... ఇసుకను బొక్కేస్తాం... ప్రాజెక్ట్‌లు, పుష్కరాల పేరుతో వేలకోట్లు నొక్కేస్తాం... అడిగిన వాళ్లను పాతరేస్తాం... ఏం మీరు అధికారంలోకి వస్తే ఇలాగే చెయ్యరా...? రాష్ట్ర ప్రభుత్వం తీరిది. రాష్ట్రంలో తమ అవినీతి, అక్రమాలను ప్రశ్నించే వ్యవస్థే లేకుండా చేసుకోవడం ఇప్పుడు చంద్రబాబు ముందున్న లక్ష్యం.

నేను మారాను... నేను మారిన చంద్రబాబును అని చంద్రబాబు పదేపదే చెప్పుకోవడం చూసాం. ఇప్పుడు నిజమేననిపిస్తోంది. చంద్రబాబు చాలా మారాడు. 1995 నుండి 2004 వరకు వున్న చంద్రబాబు వేరే... ఈ చంద్రబాబు వేరే! అప్పటి చంద్రబాబు అధికారంలో విచ్చలవిడితనాన్ని అంగీకరించేవాడు కాదు. మంత్రులను, ఎమ్మెల్యేలను అదుపులో ఉంచేవాడు. అడ్మినిస్ట్రేషన్ ఎంతో బాగుండేది. అప్పుడు కూడా చంద్రబాబు డిక్టేటర్‌లానే వ్యవహరించాడు. అయితే ఆ నియంత పాలన రాష్ట్రానికి ఉపయోగపడింది.

ఇప్పుడు మారిన చంద్రబాబు కూడా డిక్టేటర్‌లాగానే వ్యవహరిస్తున్నాడు. అయితే అది రాష్ట్రప్రగతికి కాకుండా వినాశానికి దోహదపడుతోంది. ఆయన అధికారం మత్తులో విచ్చలవిడిగా చెలరేగిపోతున్న తన మంత్రులు, ఎమ్మెల్యేల పట్ల కాకుండా ప్రతిపక్షం, ప్రజల పట్ల నియంతగా వ్యవహరిస్తున్నాడు. రాష్ట్రంలో ప్రతిపక్షమన్నదే లేకుండా చేయాలని, రాష్ట్రాన్ని ఏకఛత్రాధిపత్యంగా పాలించాలనే తపనతో ఫాసిస్టు ధోరణులను కనపరుస్తున్నాడు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసిన మీడియాను మూయిస్తాననడం, వార్తలు రాసిన విలేకరుల మీద కేసులు పెట్టాలని బెదిరించడం ఎంతవరకు సమంజసం? తన ప్రభుత్వంలోని

(మిగతా 11వ పేజీలో)



- రాజధానిలో భూప్రకంపనలు
- భూ దందాపై ధూం..ధాం...
- రైతుల భూములు ప్రభుత్వానికి
- నేతల భూములు రియాల్టీకి

## పాపాల భైరవుడు నారాయణ

నారాయణ విద్యాసంస్థల అధినేత పి.నారాయణను మున్సిపల్ మంత్రిని చేసిందే రాజధాని భూముల కోసం. మంత్రిగా రాష్ట్రంలో నారాయణ వెలగబెడుతున్నదేమీ లేదు. ఆయన ఎక్కువ సమయం అమరావతిలోనే గడుపుతున్నాడు. మొన్నటివరకు రైతుల నుండి భూములను గుంజుకోవడమే పని. ఓ పక్క రైతుల నుండి భూములు తీసుకుంటూ మరోపక్క రాజధాని చుట్టుపక్కల భూములు కొనుగోలు చేసి బినామీల పేరుతో పెట్టారు. నారాయణ భూములు కొనడం తప్పులేదు. అయితే రైతుల పొట్టకొట్టి భూములు కొనడాన్నే ప్రశ్నించాలి. అసలు మంత్రిగా లేకుంటే నారాయణ ఇంకెన్ని వందల ఎకరాలు కొనున్నా అడిగేవారుండరు. డబ్బులున్నాయి కాబట్టి కొనుక్కున్నామని చెప్పొచ్చు. కాని ఇప్పుడు రైతులను మోసం చేసి భూములను కొన్నట్లయ్యింది. తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగే అన్ని లోపాలకు, పాపాలకు ప్రధానబాధ్యుడుగా ఆయనే కనిపిస్తున్నాడు. పాపాల భైరవుడన్న పేరు తెచ్చుకుంటున్నాడు.



## అభివృద్ధి మాటున... అపరిచితులతో అపాయం!

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నది నెల్లూరుజిల్లానే! ఈ జిల్లాకు పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. పరిశ్రమల స్థాపనకు ఈ జిల్లా చాలా అనుకూలంగా ఉందని పెట్టుబడుదారులు విశ్వసిస్తున్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించబడ్డ కృష్ణపట్నంపోర్టు, శ్రీసిటి, మేనకూరు సెజ్‌లు ఇందుకు ప్రధానకారణం. పారిశ్రామికంగా రాష్ట్రానికే నెల్లూరుజిల్లా ఆయువుపట్టుగా నిలవనుందనేది నగ్నసత్యం.

అభివృద్ధి జరుగుతుందని ఆనందించడంతో పాటు అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన విషయాన్ని కూడా గుర్తించాలి. ఎక్కడైతే అభివృద్ధి, వాణిజ్య లావాదేవీలు ఎక్కువగా జరుగుతుంటాయో అక్కడంతా మాఫియా ముఠాలు పుట్టుకొస్తుంటాయి. ఇప్పుడు స్వదేశీ ముఠాలతో పాటు విదేశీ ఉగ్రవాదుల మీద కూడా ఓ కన్నేయాల్సిన పరిస్థితులు దాపురించాయి.


ప్రపంచవ్యాప్తంగా ఉగ్రచర్యలు వెర్రితలలు వేస్తున్నాయి. ముఖ్యంగా ఇటీవల కాలంలో సముద్రతీర ప్రాంతాలను ఉగ్రవాదులు లక్ష్యంగా ఎంచుకుంటున్నారు. నెల్లూరుజిల్లాలో అన్ని సెజ్‌లలో వందలాది పరిశ్రమలు వెలిశాయి. కృష్ణపట్నం పోర్ట్ సెజ్ పరిధిలోనే విద్యుత్ కంపెనీలు, పామాయిల్ పరిశ్రమలు, ఇతరత్రా ఫ్యాక్టరీలు 50దాకా వున్నాయి. మరికొన్ని పరిశ్రమలు రాబోతున్నాయి. ఈ పరిశ్రమలలో 50వేలమంది దాకా పనిచేస్తున్నారు. వీరిలో సగం మంది బయట రాష్ట్రాలు, ప్రాంతాల నుండి వచ్చిన వాళ్ళే! అయితే వీళ్లెవరో, ఎక్కడి నుండి వచ్చారో తెలియదు. వీరి నుండి గుర్తింపు కార్డులు తీసుకున్నాకే ఆయా

(మిగతా 11వ పేజీలో)



## ఈ సంతకం... బాధ్యతలకు సంకేతం

(వివరాలు 5వ పేజీలో)



## నేవిగేషన్ కోసం నింగికేగింది

పిఎస్ఎల్‌వి-సి32 విజయవంతం

(వివరాలు 3వ పేజీలో)

# ఉచితం ఊరింపేనా?




**రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుకతో జనాన్ని ఊరిస్తోంది. ఫ్రీ ఇసుకే కదా అని ట్రాక్టర్లు తీసుకుని రీచ్‌ల వద్దకు పోతే అక్కడ స్థానిక అధికారపార్టీ నాయకులు అడ్డు కుంటూ ట్రాక్టర్‌కింతని సుంకం కట్టాల్సిం దేనంటూ భీష్మించుకు కూర్చుంటున్నారు. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించ లేదన్నట్లుగా మారింది పరిస్థితి.**

జిల్లాలో 9రీచ్‌లలో ఇసుకను ఉచితంగా తీసుకోవచ్చంటూ జిల్లా కలెక్టర్ యం.జానకి ప్రకటించారు. కోలగట్ల, పడమటిపాలెం, అప్పారావుపాలెం, పుచ్చలపల్లి, గొల్లకందుకూరు, చిగురుపాడు, సజ్జాపురం రీచ్‌లలో ఇసుకను ఉచితం చేశారు. వీటికి మాత్రమే పర్యావరణ అనుమతులున్నాయని, మిగిలిన రీచ్‌లకు అనుమతులు లేవు కాబట్టి ఇసుక తవ్వకాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదని అంటున్నారు. మరి పర్యావరణ అనుమతులు లేనప్పుడు మొన్న 25రీచ్‌లకు ఎందుకు టెండర్లు పిలిచారో అధికారులకే తెలియాలి. ఇసుకను అమ్మేటందుకైతే ఒక న్యాయం, ఉచితంగా ఇచ్చేందుకైతే ఒక విధానం అన్నట్లుగా వుంది. అనుమతులిచ్చిన ఈ 9రీచ్‌లలో ఇసుక నిల్వలు చాలా తక్కువగా వున్నాయి. ఇసుక నిల్వలు భారీగా వున్న రీచ్‌లలో మాత్రం పర్యావరణ అనుమతి పేరుతో ఇసుక తవ్వకాలకు సిగ్నల్ ఇవ్వలేదు.

రీచ్‌ల నుండి ఇసుకను ఉచితంగా తోలుకుపోతుండడం అధికారపార్టీ నేతలకు మింగుడుపడడం లేదు. వాళ్ల సంపాదన ఆశలన్నీ ఈ రీచ్‌ల మీదే వుండినాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు గాని, కాంట్రాక్టర్లు గాని ఇసుకను పిండి కోట్లు సంపాదించారు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక ఈ ఒకటిన్నర ఏడాదిలో స్థానిక నాయకులు కూడా రీచ్‌ల మీద బాగానే సంపాదించుకున్నారు. ఈమధ్య ఇసుక వ్యాపారం కోసమే కొందరు నాయకులు వైకాపా, కాంగ్రెస్‌ల నుండి తెలుగుదేశంలో చేరారు. అయితే ప్రభుత్వం ఇసుకను ఉచితం చేయడంతో వీళ్ల నోట్లో గ్రావెల్ కొట్టినట్లయ్యింది. ఇసుక మీద కాసులు చూసిన ప్రాణాలు... ఉచితాన్ని జీర్ణించుకోలేకపోతున్నాయి. ఫ్రీ ఇసుకను తీసుకుపోదామని వచ్చిన లారీలు, ట్రాక్టర్ల వద్ద నుండి స్థానిక నాయకులు వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం ఫ్రీ అని చెప్పినా ఈ నాయకుల దందా ఏంటని ప్రజలు వాపోతున్నారు.

## చిన్నారులకు ఆదర్శం.. హఫీజ్ ఆలీ



నెల్లూరు వెంగళరావునగర్‌లో వున్న మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతున్న హఫీజ్ ఆలీ అనే విద్యార్థి పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇంట్లో వున్న పెరట్లో మొక్కలు పెంచుతూ చిన్నారులందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆ మేరకు ఆ విద్యార్థికి పాఠశాలలో ఇటీవల అభినందన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారి లోకానికి ఈ విద్యార్థి ఎంతో స్ఫూర్తినిస్తున్నాడంటూ జిల్లా ఎస్సీఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఎం. మాలకొండారెడ్డి ఆ విద్యార్థిని అభినందించాడు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో హఫీజ్ ఎలాంటి రసాయనిక ఎరువులు, పురుగుమందులు లేకుండా మొక్కలు పెంచుతూ, భూమి-నీరు-చెట్టును సంరక్షిస్తుండడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏ.అరుణ, సామాజిక కార్యకర్త సయ్యద్ ఘనీబాషా, ఉపాధ్యాయులు మస్తాన్‌వలీ, ఏ.శ్రీలక్ష్మి, మృదుల పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లో తపాలా సేవలు

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట ఉపతపాలా కార్యాలయంలో సోమవారం ఆన్‌లైన్ సేవలు ప్రారంభించారు. నెల్లూరు డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్లు మురళి, గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు చేరువగా తపాలా సేవలను తీసుకువెళుతూ వినియోగదారులను పెంచుకోవడమే లక్ష్యంగా పోస్టల్ శాఖ పనిచేస్తోందన్నారు. నెల్లూరు డివిజన్ పరిధిలో రెండు ప్రధాన, 61ఉపతపాలా కార్యాలయాల్లో ఇప్పటికి 43కార్యాలయాల్లో ఆన్‌లైన్ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. మరో 13కార్యాలయాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. తపాలా ద్వారా బీమా రంగ సేవలను ఆన్‌లైన్ ద్వారా వినియోగదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టోన్‌హౌస్‌పేట పోస్టాఫీసు పోస్టు మాస్టర్ శ్రీనివాసులు, తపాలా ఇన్స్‌పెక్టర్ చైతన్య, సహాయ ఐపివో సుధాకర్, పిఏలు నాగరాజు, వంశీమోహన్, ఏపిఎం సాయిచంద్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

## ప్రొ. ఎంఎల్ కాంతారావు

ఏపి 4వ ఆర్థిక సంఘం అధ్యక్షుడు ప్రొ.ఎంఎల్ కాంతారావు గతనెల 29న కన్నుమూశారు. ఉదరకోశ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో ఆయన మృతిచెందారు. నెల్లూరు నివాసి అయిన కాంతారావు, 1950లో వీఆర్‌సిలో బిఏ పాసై, ఎస్వీ యూనివర్సిటీలో ఎంఏ పిహెచ్‌డి చేసి, అక్కడే ప్రొఫెసర్‌గా పనిచేశారు, ఎస్‌కెయులో కూడా ప్రొఫెసర్‌గా పనిచేశారు. అక్కడ రిటైరయ్యాక ఏపి కాలేజ్ సర్వీస్ కమిషన్ సభ్యునిగా చేరారు. ప్రముఖ పత్రికల్లో వ్యాసాలు కూడా రాస్తుండేవారు. కాంతారావు మృతిపట్ల సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## బంగారంగళ్ళ బంద్

### ఎక్సైజ్‌డ్యూటీకి నిరసనగా నిరవధిక సమ్మె





కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో బంగారం పై ఎక్సైజ్‌డ్యూటీ విధించినందుకు నిరసనగా బంగారు నగల హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు, కార్పొరేట్ సంస్థలు, స్వర్ణకారులందరూ కలిసికట్టుగా దేశవ్యాప్తంగా బంద్ నిర్వహించనున్నట్లు జిల్లా బులియన్ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.శాంతిలాల్ జైన్ పేర్కొన్నారు. జిజెఎఫ్ పిలుపు మేరకు ది ఏ.పి బులియన్ గోల్డ్ అండ్ సిల్వర్, డైమండ్స్ మర్చంట్స్ అసోసియేషన్ ఈ నెల 9 నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా 9వ తేది సాయంత్రం నెల్లూరు చిన్నబజార్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఎక్సైజ్‌డ్యూటీ వల్ల బంగారం వ్యాపారులకు, స్వర్ణకారులకు, కోట్లాది మంది బంగారుపనివారికి ఎంతో ఇబ్బంది కలుగుతుందన్నారు. 1 శాతం పన్ను కట్టేందుకు ఏ సమస్యా లేదని, అయితే అదనంగా ఎక్సైజ్ డ్యూటీ వేయడం వల్ల బంగారు వర్తకం, పరిశ్రమ అంతా ఇబ్బందుల పాలవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బంగారంపై ప్రభుత్వం విధించిన ఎక్సైజ్ పన్నును వెంటనే రద్దు చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఎక్సైజ్ డ్యూటీని పూర్తిగా రద్దు చేసేవరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా కోట్లదిమంది బంగారు పనివారు, వర్తకులు అన్ని అసోసియేషన్ల నాయకత్వంలో ఈ తాజా పన్నుకు నిరసన తెలియజేస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి బులియన్ గోల్డ్ సిల్వర్ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ ఛీఫ్ ఆర్గనైజర్ శాంతిలాల్‌జైన్‌తో పాటు, రాష్ట్ర కోశాధికారి మణిలాల్‌జైన్, వైస్ ప్రెసిడెంట్ డి.ప్రభాకర్, ట్రెజరర్స్ శంకర్‌లాల్ జైన్, అలిమెలి సుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్, పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ కార్యదర్శి పాబోలు నాగేశ్వరరావు, కోశాధికారి ముంజలూరు శ్రీనివాసులు, కందుకూరి చెంగయ్యఆచారి, పోట్లూరి రామకృష్ణ, దండపాణి సురేష్, వెంకట శేషయ్య ఆచారి వేలూరు రవీంద్ర, దువ్వూరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## దేశంలోకి హంస

మాజీ జడ్పీటీసీ సభ్యులు, నెల్లూరురూరల్ నరసింహకొండకు చెందిన నాయకుడు వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డి 5వ తేదీ నెల్లూరులో రూరల్ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో తెలుగుదేశంలో చేరారు. ఆయనతో పాటు కొడుకులు హరిశివారెడ్డి, హరికృష్ణారెడ్డి, దేవరపాలెం సర్పంచ్ పెంచలయ్య, ఆమంచర్ల ఎంపిటిసి రత్నమ్మలు కూడా తెలుగుదేశంలో చేరారు. హంసకుమార్‌రెడ్డి ప్రస్తుతం వైకాపా స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా వున్నారు. నరసింహకొండ ప్రాంతంలో ఇసుకరీచ్‌లు, గ్రావెల్ క్వారీలలో వీళ్లది పెద్ద వ్యాపారం. ఇంకా పలు వ్యాపారాలున్నాయి. అధికారపార్టీలో వుంటే అన్నీ సవ్యంగా సాగుతాయని చెప్పి తెలుగుదేశంలో చేరారు. వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డి చేరడంతో నెల్లూరురూరల్‌లో తెలుగుదేశం పార్టీ దృఢంగా తయారైందని ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి టి.రమేష్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ రూరల్ కన్వీనర్ కిలారి వెంకటస్వామినాయుడు, తెలుగుదేశం నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, మండవ రామయ్య, సిహెచ్ హరిబాబుయాదవ్‌లు పాల్గొన్నారు.

## మాగుంట లే అవుట్‌లో భారీ చోరీ

నెల్లూరు జూబ్లీహిల్స్‌గా పేరుగాంచిన మాగుంట లేఅవుట్‌లో బుధవారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగింది. కింగ్స్‌కోర్టు అవెన్యూలోని 5వ వీధిలో వుంటున్న కె.పద్మావతి ఇంట్లో దొంగలు పడి 30.77లక్షల విలువచేసే 72సవర్ల బంగారు నగలు, 52కిలోల వెండి, రెండున్నర లక్షల నగదును అపహరించుకు వెళ్లారు. భర్త కె.రమణారెడ్డి చనిపోవడంతో పద్మావతి తన కుమార్తెతో కలిసి ఇంట్లో ఉంటుంది. ఇద్దరూ మహిళలే కావడంతో సెక్యూరిటీ కోసం ఇంట్లో హైఫ్రీక్వెన్సీ సి.సి కెమెరాలను ఏర్పాటు చేసి, పద్మావతి తన సెల్‌ఫోన్‌కు వాటితో అనుసంధానం చేసింది. వీళ్లు బయట ప్రాంతాలకు వెళ్లినప్పుడు కూడా తమ ఇంటి వద్ద ఏం జరిగేది తెలుసుకోవచ్చు. ఈ నెల 6వ తేదీన పద్మావతి తన కుమార్తెతో కలిసి చెన్నైలో వుంటున్న తన అన్న గోపాలరెడ్డి ఇంటికి వెళ్లింది. ఆరోజు రాత్రి కూడా ఆమె సెల్‌ఫోన్‌లో తన ఇంటి పరిసరాలను చూసుకుంది. అయితే ఆరోజు రాత్రే దుండగులు ఆమె ఇంట్లోకి ప్రవేశించి తాళాలు పగలగొట్టారు. బెడ్‌రూంలో వున్న బీరువాను పగులగొట్టి అందులో వున్న ఆభరణాలు, నగదును తీసుకున్నారు. తమ ఆనవాళ్లు దొరకకుండా సి.సి కెమెరాలను పగులగొట్టి రికార్డింగ్ యూనిట్‌ను కూడా తమ వెంట తీసుకెళ్లారు. బుధవారం ఉదయం పని మనిషి సునీత ఇంటిని శుభ్రం చేయడానికి వచ్చింది. తలుపులు పగలగొట్టి ఉండడం, లోపల గందరగోళ వాతావరణాన్ని చూసి సునీత చెన్నైలో వున్న పద్మావతికి ఫోన్ చేసి విషయం చెప్పడంతో చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ప్రాంతంలో ఇళ్లలు చాలా పలుచగా వున్నాయి. నైట్ సెక్యూరిటీ తక్కువ. ఒక ఇంటోళ్లతో పక్కింటోళ్లకు సంబంధాలుండవు. ఈ ఇంట్లో ఏం జరుగుతుందనేది పక్కింటోళ్లకు తెలియదు. కాబట్టే దొంగల పనులు చాలా సులభంగా జరిగిపోతున్నాయి.

## ఉత్తమ ప్రిన్సిపాల్ అంజనీదేవి

నెల్లూరుజిల్లా మర్రిపాడులోని కస్తూర్బా విద్యాలయం ప్రిన్సిపాల్ అంజనీదేవి ఉత్తమ ప్రిన్సిపాల్ పురస్కారాన్ని అందుకున్నారు. కర్నూలులో రాష్ట్ర గనులు, భూగర్భ, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి పీతల సుజాత ఆమెను సత్కరించారు. రాష్ట్రంలోని కస్తూర్బా విద్యాలయాలన్నింటికల్లా మర్రిపాడు కస్తూర్బా విద్యాలయాన్ని ఎంతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దారు. చదువుల్లోనూ, ఆటల్లోనూ విద్యార్థులను ప్రోత్సహించారు. ఆమె కృషికి గుర్తింపే ఈ బహుమానం.

### మునిసిపల్ స్కూళ్ళ అభివృద్ధికి

# దాతల సహకారం అమోఘం



విద్యార్థులకు ఫలహారం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

అత్యధికంగా పేద విద్యార్థులు చదువుకునే మునిసిపల్ స్కూళ్ళ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం విస్మరించలేనిదని, ఆయా పాఠశాలల్లో అనేక వసతులు కల్పించేందుకు ఎంతో ధనాన్ని విరాళంగా అందించి ఆయా స్కూళ్ళ అభివృద్ధికి, తద్వారా విద్యార్థుల ప్రగతికి వారు బంగరుబాటలు వేస్తున్నారని, దాతల ఔదార్యం అమోఘం.. అభినందనీయమని నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ ప్రశంసించారు. బుధవారం నెల్లూరులోని ఏసి నగర్ మల్లెల సంజీవయ్య మునిసిపల్ హైస్కూల్‌లో షిరిడి సాయి భక్తబృందం ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ఫలహారం పంపిణీ చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేద విద్యార్థులు చదువుకునే ఈ మునిసిపల్ స్కూళ్ళలో వసతుల కల్పనకు, వాటి అభివృద్ధికి ప్రభుత్వం ఏమీ పట్టించుకోకపోవడం విచారకరమని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు.

# ఇందిరాదత్‌కు ఘన సన్మానం




ప్రపంచ తెలుగు సమాఖ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 4న చెన్నైలోని వాణిమహల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ సమాఖ్య అధ్యక్షులు వివెల్ ఇందిరాదత్‌ను ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ కమిటీ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు, వైస్ ఛైర్మెన్ వీరిశెట్టి హజరత్‌బాబు ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమంలో తమిళనాడు స్టేట్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఛైర్‌పర్సన్ జస్టిస్ టి. మీనాకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొనగా, ప్రపంచ తెలుగు సమాఖ్య మహిళా విభాగం అధ్యక్షురాలు ప్రమీల ఆనంద్, సురేఖ మోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ విశాఖలో తెలుగు సాంస్కృతిక నికేతనం విజయవంతమైన సందర్భంగా ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలైన ఇందిరాదత్‌కు, గిన్నీస్ వరల్డ్ రికార్డ్ పొందిన మదర్ ఇండియా క్రోచెట్ క్వీన్స్ రీతూ శివరామప్రసాద్, లక్ష్మీ మోహన్‌రావు, పద్మా అరవిందన్‌లకు ఘన సన్మానం జరిగింది. ప్రపంచ తెలుగు సమాఖ్య ద్వారా తెలుగు భాషాభివృద్ధికి ఇందిరాదత్ చేస్తున్న కృషిని పలువురు వక్తలు ఈ సందర్భంగా కొనియాడారు.

# పింఛన్‌ల ఎంపికలో మీ పెత్తనం ఏమిటి?

### - అసెంబ్లీలో కాకాణి



జన్మభూమి కమిటీలు రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాయని సర్వేపల్లి శాసనసభ్యుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి శాసనసభలో ప్రస్తావించారు. శాసన సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన పింఛన్ల వివరాలు, కేంద్ర ప్రభుత్వం పింఛన్ల సహాయంపై మాట్లాడుతూ ప్రభుత్వం జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి అర్హులైన పింఛను దార్లకు మొండిచేయి చూపిస్తూ, తీవ్రమైన అన్యాయం చేస్తోందని ఆయన ధ్వజమెత్తారు. వై.యస్. ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో అర్హులైనవారందరికీ, పార్టీలకు అతీతంగా పెన్షన్లు అందజేస్తే, ప్రస్తుత ప్రభుత్వం జన్మభూమి కమిటీలలో తమ పార్టీ వారిని ఏర్పాటు చేసుకుని పింఛన్‌ల పంపిణీని రాజకీయం చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ వెంటనే పెన్షన్లు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశాడు. గత ప్రభుత్వంలో అందజేసిన పింఛన్ల వివరాలను, ప్రస్తుత ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్ల వివరాలను గణాంకాలతో సహా వివరించాడు. ఆధార్‌కార్డులలో చేతి వేళ్ళు నమోదు కాలేదని, భూమి కలిగివున్నారని, వయస్సు తక్కువ కారణంతో తమవారికి చెందిన పింఛన్లు మాత్రమే తొలగించడం దారుణమన్నారు.

# నేవిగేషన్ కోసం నింగికేగింది

### • పిఎస్ఎల్‌వి-సి32 సూపర్ సక్సెస్



రాకెట్ ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) నమ్మకానికి అమ్మలాంటి పిఎస్ఎల్వి సిరీస్ మరోసారి తనపై వుంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంది. ఇస్రోవాళ్లు ఇతర దేశాల మీద ఆధారపడకుండా సొంత తెలివితేటలతో రూపొందించి ప్రయోగించిన పిఎస్ఎల్‌వి-సి32 ప్రయోగం విజయవంతమైంది. ఈ రాకెట్ ద్వారా ఐఆర్ఎన్ఎస్ఎస్-ఎఫ్1 ఉపగ్రహాన్ని శాస్త్రవేత్తలు నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టగలిగారు.

నేవిగేషన్ వ్యవస్థ కోసం మనం ఇంత వరకు అగ్రరాజ్యాల మీద ఆధారపడుతూ వచ్చాం. జిపిఎస్ సిస్టం కోసం వందల కోట్లు ఖర్చు చేస్తున్నాం. జిపిఎస్‌ను సొంతంగానే రూపొందించుకోవాలనే లక్ష్యంతో ఇస్రో ఈ ఉపగ్రహ రూపకల్పనకు పూనుకుంది. 10వ తేదీ సాయంత్రం 4గంటలకు శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుండి పిఎస్ఎల్‌వి-సి32ను ప్రయోగించారు. మొత్తం నాలుగు దశలలో 20నిముషాల వ్యవధిలో ప్రయోగం పూర్తయ్యి ఉపగ్రహం నిర్ణీత కక్ష్యలోకి చేరుకుంది. ప్రయోగం విజయవంతం కాగానే శాస్త్రవేత్తలు పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు. షార్ అంతటా ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. రాకెట్ ప్రయోగం విజయవంతం కావడం పట్ల రాష్ట్రపతి, ప్రధాని ఇస్రో శాస్త్రవేత్తలకు తమ అభినందనలు తెలియజేశాయి.

# ప్రగతిపథంలో సహకార బ్యాంకు



నెల్లూరు నగర సహకార బ్యాంకు శాఖ ప్రగతిపథంలో అభివృద్ధి చెందుతుందని నెల్లూరు కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షులు మెట్టుకూరు ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. గురువారం నెల్లూరు అరవింద నగర్‌లోని పట్టణ శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పట్టణశాఖను 28ఏళ్ల క్రితం ప్రారంభించి 21 సహకార సంఘాలతో రూ.23లక్షల డిపాజిట్లతో, 4కోట్ల స్వల్పకాలిక, రూ.1.30కోట్ల దీర్ఘకాలిక రుణాలతో ప్రారంభించబడిందన్నారు. గత ఏడాది మార్చి 31కి 10సహకార సంఘాలతో రూ.11.62కోట్ల డిపాజిట్లతో రూ.16.65కోట్ల స్వల్పకాలిక, రూ.9.14కోట్ల దీర్ఘకాలిక, రూ.2.29కోట్ల బంగారు ఆభరణాల హామీపై రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఈ యేడాది ఫిబ్రవరి 29 నాటికి రూ.15కోట్ల డిపాజిట్లు, రూ.17.74కోట్ల స్వల్పకాలిక, రూ.8.61కోట్ల దీర్ఘకాలిక, రూ.16కోట్ల యస్‌టి అదర్స్, రూ.2.35కోట్ల బంగారు ఆభరణాల హామీపై ఋణాలు ఇవ్వడం జరిగిందన్నారు. అంతేకాకుండా పర్సనల్ లోన్ ప్రభుత్వ ఉద్యోగులకు రూ.31.84 లక్షలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం బ్యాంకు డిపాజిట్లు 15కోట్లు సేకరించి జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.వి.రమణారెడ్డి, రాజారెడ్డి, వై.సరిత, జిల్లా సహకార బ్యాంకు కోశాధికారి రాజేశ్వరరావు, డైరెక్టర్లు సిహెచ్ వెంకటశేషయ్య, బి.వెంకటేశ్వర్లుగౌడ్, సి.రమణారెడ్డి, టిపి గూడూరు, కృష్ణపట్నం సహకార సంఘ అధ్యక్షులు శ్రీనివాసులు, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో పార్క్‌సన్స్ ప్యాకేజింగ్ ఉత్పత్తి కేంద్రం



లామినేటెడ్ ప్యాకేజింగ్ పెట్టెల తయారీలో, వాటి ఎగుమతిలో దేశంలో ప్రఖ్యాతిగాంచిన పార్క్‌సన్స్ ప్యాకేజింగ్ సంస్థ, శ్రీసిటిలో నిర్మించ తలపెట్టిన నూతన ఉత్పత్తి కేంద్రానికి గురువారం శంకుస్థాపన జరిగింది. ఆ సంస్థ అధ్యక్షులు రమేష్ కేజ్రీవాల్ భూమిపూజ నిర్వహించి పునాదిరాయి వేశారు. ఈ సందర్భంగా రమేష్ కేజ్రీవాల్ మాట్లాడుతూ తమ వ్యాపార విస్తరణలో భాగంగా శ్రీసిటీలో ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మిస్తున్నామని, పెరుగుతున్న గిరాకీకి ధీటుగా, దక్షిణ భారత దేశంలో తమ ఉత్పత్తులను సకాలంలో అందజేయటంలో ఈ కేంద్రం కీలకమన్నారు. వ్యాపారానికి శ్రీసిటి అనుకూలంగా ఉన్నందున తమ కేంద్రాన్ని ఇక్కడే స్థాపించడానికి నిర్ణయించామని ఆయన చెప్పారు. ప్యాకేజింగ్ రంగంలో దేశంలోనే అగ్రగణ్య సంస్థ పార్క్‌సన్స్ శ్రీసిటీకి రావడం ముదావహమని, తయారీ పరిశ్రమలకు తోడుగా ఇటువంటి సహాయక పరిశ్రమలు కూడా ఇక్కడ స్థాపించబడటం వల్ల వ్యాపారాభివృద్ధికి అనువైన వాతావరణం ఏర్పడుతుందని శ్రీసిటీ వ్యవస్థాపక నిర్వాహక సంచాలకులు రవీంద్ర సన్నారెడ్డి అభిప్రాయపడ్డారు. దక్షిణ భారతదేశంలో ఇది ఆ సంస్థ యొక్క తొలి ఉత్పత్తి కేంద్రం. 10ఎకరాలలో రూ.70కోట్ల వ్యయంతో నిర్మించబడుతున్న ఫ్యాక్టరీలో 300కి ఉపాధి దొరుకుతుంది.



## 'ప్రభా'తం

మనవాళ్లెప్పుడూ ఇంతే. అవేం రాజకీయాలో తెలియదు కానీ, మాటలు చెప్తుంటారే తప్ప ఆచరణలోకి వచ్చేసరికి మళ్ళీ షరా మామూలే. అన్ని దేశాలతో పాటు మనదేశం కూడా ఇటీవలికాలంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో మహిళలకు సమానావకాశాలు వుంటే, మహిళలు కూడా అన్ని రంగాల్లో ధీటుగా ఎదుగుతారని, అందుకు వారికి తగు అవకాశాలు కల్పించాలని ఎంతో కాలం నుంచి అందరూ అంటున్నదే.. జనమంతా వింటున్నదే. అయినా, ఇందులో ఆలోచించాల్సింది కూడా ఏమీ లేదు.

అటు ప్రతిభలోనూ, ఇటు సాహసోపేతమైన రంగాల్లోనూ, ఉన్నతమైన ఉద్యోగాల్లోనూ, సేవా రంగంలోనూ ఇలా అన్ని రంగాల్లో మహిళలు ఎంతోకాలం నుంచి తమ అసమాన ప్రతిభను, ధీరత్వాన్ని చాటుకుంటూనే వున్నారు. ఎన్ని ఆర్థికపరిస్థితులు అతలాకుతలం చేస్తున్నా వెనుకడుగు వేయకుండా అటు ఇంటినీ, ఇటు సమాజాన్నీ..తద్వారా మొత్తంగా దేశాన్నీ పరిరక్షించే దిశలో మహిళలు చూపుతున్న శ్రద్ధాశక్తులు..చేస్తున్న అసమాన సేవలు..సర్వదా వందనీయం. శతధా అభినందనీయం. ఒకవైపు కుటుంబ బాధ్యతలు మోస్తూనే, మరోవైపు మహిళలు ఆశించిన రంగాల్లో ఎంతో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూనే వున్నారు. ఎన్నో సమస్యలు అవస్థల మధ్య జీవితప్రయాణాన్ని సాగిస్తూనే సమాజాభ్యున్నతికి తమవంతు గౌరవప్రదమైన సేవలందిస్తూనే వున్నారు. కానీ, వారికి సగౌరవంగా అందివ్వాల్సిన అవకాశాలు మాత్రం వారి చేతికందకపోవడమే విచారకరం. ఎంతోకాలం నుంచి మన నాయకులు మహిళా సాధికారత అంటున్నారే తప్ప అది ఆచరణలోకి వచ్చింది మాత్రం లేదు. ఎప్పుడో తీసుకోవాల్సిన నిర్ణయం. ఇంకా ఇదిగో అదిగో అంటూనే కాల యాపన చేస్తూ ఏళ్లూపూళ్లూ గడిపేయడంలో మన వారికున్న ప్రజ్ఞ మరెవరికీ వుండదేమో అనిపిస్తోంది.. మహిళా దినోత్సవాల్లో మాత్రం పదేపదే మహిళల అభ్యున్నతి గురించి గొప్పగా చెప్పేస్తుంటారే తప్ప, ఆ రోజు గడిచిపోతే ఆ మాటలన్నీ ఇక అటకెక్కినట్లే. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని యుపిఏ హయాంలో మహిళా బిల్లు లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజార్టీతో నెగ్గినప్పటికీ, రాజ్యసభలో పెండింగ్‌లో పడిపోవడం ఎంత బాధాకరం?...

ఇప్పటికీ పార్లమెంట్‌లో 12 శాతానికి మించి మహిళా ప్రాతినిధ్యం లేకపోవడం మనకు తలవంపులు తెచ్చే విషయమని సాక్షాత్తూ భారత రాష్ట్రపతి ఆవేదన వ్యక్తం చేశారంటే పరిస్థితి తేటతెల్లమవుతుంది. మహిళలకు ప్రాతినిధ్యం లేకుండా అసలు సాధికారత అనేది ఎలా సాధ్యమని మొన్నటికి మొన్న ఢిల్లీలో జరిగిన మహిళా సదస్సుల్లో రాష్ట్రపతి సరిగ్గా, సూటిగానే ప్రశ్నించారు కూడా. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళు గడిచినా ఇంకా మనం మహిళా సాధికారత వంటి ముఖ్యమైన, అత్యవసరమైన విషయాల్లో వెనుకబడి వుండడంలో అర్థం లేదు. మహిళాభ్యుదయం అంటే దేశాభ్యుదయమేనని, ఇంటిని చక్కదిద్దే మహిళ, సమాజాన్నీ- దేశాన్ని కూడా గొప్పగా చక్కగా చక్కదిద్దుతుందని, మహిళలను గౌరవించుకోవడమంటే మనల్ని మనం గౌరవించుకోవడమేనని అందరికీ తెలిసినప్పటికీ, మహిళా బిల్లుకు ఇంకా చర్చలూ సమావేశాలూ అంటూ ఇప్పటిదాకా కాలయాపన జరిగిపోయింది. అయినా, మహిళలకు సమానావకాశాలు కల్పించడంలో భిన్నాభిప్రాయాలకు తావెందుకో సామాన్యులకు అర్థం కాదు. ఆకాశంలో సగం అంటూనే..అవకాశంలో శూన్యం చేయడం సముచితమా?..ఇదేం పద్ధతి?.. అందువల్ల చివరికి ఎవరికి నష్టం?..మనకీ, మన చుట్టూ వున్న సమాజానికే కాదా!.. పురుషులతో పాటుగానే కాదు, వారికంటే ధీటుగా అనేకరంగాల్లో మేటిగా రాణిస్తూ, అటు కుటుంబానికీ ఇటు సమాజానికీ, మొత్తంగా దేశానికీ సమర్థ వంతమైన, అత్యంత నమ్మకమైన..శ్లాఘనీయమైన సేవలందించేది మహిళలేనని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. అయినా, వారికి సమాజంలో కనీస అవకాశాలు కాదు కదా..కనీసభద్రత కూడా అంతంతమాత్రమే కావడం ఎంత శోచనీయం!..

అయితే, ఏదేమైనా ఈ పరిస్థితులను మార్చేందుకు ఇప్పటి ప్రభుత్వాలైనా సరైన దిశలో ఆలోచిస్తూ మహిళా సాధికారత కోసం మంచి నిర్ణయాలు తీసుకోవడం ఎంతో సంతోషకరం.. దేశానికి శుభకరం. ఎంతో కాలంగా పెండింగ్‌లో వున్న ఈ బిల్లు ఇప్పుడు ఒక కొలిక్కి రావడానికి మార్గం సుగమమైనట్లు కనిపిస్తోంది. మరోవైపు ప్రధాని మోడీ కూడా ఈ విషయమై స్పందిస్తూ, మహిళల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి వుందని స్పష్టం చేశారంటే.. ఇక ఆలోచించాల్సిన అవసరమే లేదు.. ఆ బిల్లు వీలైనంత త్వరలోనే ఆచరణలోకి వచ్చేస్తుందని ఆశించవచ్చు. ఈ నేపథ్యంలో మన రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతను కాంక్షిస్తూ తాజాగా ఒక తీర్మానం చేసి కేంద్రానికి పంపడం , చట్టసభల్లో మూడో వంతు స్థానాలు మహిళలకే కేటాయించాలని, ఆ మేరకు మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ కేంద్రానికి సిఫార్సు చేయడం ద్వారా మన రాష్ట్రప్రభుత్వం మహిళాభ్యున్నతికి జై కొట్టింది. మహిళల సాధికారత విషయంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ తీసుకున్న ఈ నిర్ణయం ఎంతైనా చరిత్రాత్మకమే. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ మేరకు ఈ నెల 8న ప్రవేశపెట్టిన తీర్మానాన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించడం ఎంతో శుభపరిణామం. అంతేకాదు, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రప్రభుత్వం మహిళలకు వరాల వర్షం కురిపించడం..మహిళలకు విద్య, ఉపాధి, భద్రత, వైద్యవసతులు తదితర సౌకర్యాల కల్పనకు ముఖ్యమంత్రి తగు నిర్ణయాలు తీసుకోవడం హర్షణీయం. గతంలో వలె కాక, ఇప్పటికైనా మహిళా సాధికారతను మాటల్లోంచి చేతల్లోకి తెచ్చేందుకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు గట్టిగా సంకల్పించడం, మహిళామతల్లుల భవితను తీర్చిదిద్దేందుకు, వారు అన్నిరంగాల్లో మునుపటికంటే ఉజ్వలంగా రాణించేందుకు ఈ మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు గట్టి సంకల్పం తీసుకోవడం పట్ల ప్రజల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

### మంచి నిర్ణయం


మహిళా సాధికారత విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సరైన దిశలో ఆలోచిస్తూ మంచి నిర్ణయాలు తీసుకుంటుండడం ఎంతో సంతోషకరం.. దేశానికి శుభకరం. చట్టసభల్లో మూడో వంతు స్థానాలు మహిళలకే కేటాయించాలని కోరుతూ కేంద్రానికి సిఫార్సు చేయడం ద్వారా మన రాష్ట్రప్రభుత్వం మహిళాభ్యున్నతికి జై కొట్టింది. ఆ మేరకు ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన తీర్మానానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించడం చరిత్రాత్మకం. మహిళా సాధికారతకు ఇవన్నీ మేలు బాటలేననవచ్చు.

## నేత్రపర్వంగా ద్వాదశ జ్యోతిర్లింగ శోభాయాత్ర



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులో ద్వాదశ జ్యోతిర్లింగ శోభాయాత్ర నేత్రపర్వంగా సాగింది. న్యాయమూర్తి నరసింహారాజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. యాత్రలో వందలాది మోటార్ సైకిళ్లు, కార్లు జ్యోతిర్లింగాలను అమర్చుకుని నెల్లూరు వేదాయపాలెం బస్టాండ్ సెంటర్ నుండి నగర పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి తిరిగి వేదాయపాళెం సేవాకేంద్రంకు చేరుకుంది. డిఎస్పీ చెంచురెడ్డి జ్యోతిప్రకాశనం చేసి జెండాను ఆవిష్కరించారు. నెల్లూరుశాఖ ఇన్‌ఛార్జ్ సిస్టర్ బి.కె.ప్రసన్న మాట్లాడుతూ సహనం, దయ, కరుణలకు బ్రహ్మకుమారీలు ప్రతిరూపమన్నారు. మానసిక, శారీరక, శాంతి కోసం బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం గత 80సంవత్సరాలుగా కృషి చేస్తోందన్నారు. ఆరోగ్యం, ఆనందం, శాంతి కోసం ఉచిత రాజయోగ తరగతులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల దేవతామూర్తుల అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఎ.జయప్రకాష్, దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, సిస్టర్లు రాజేశ్వరి, సునీత, మణి, రాధా తదితరులు పాల్గొన్నారు.

## బంగారంతో సూక్ష్మ శివలింగం



నెల్లూరు జెండావీధికి చెందిన స్వర్ణకారుడు డా॥ షేక్ ముసవ్వీర్ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 100మి.గ్రా స్వర్ణంతో బియ్యపు గింజ పరిమాణంలో శివలింగం, త్రిశూలం, ఢమరకం, పాము పడగను కళాత్మకంగా తీర్చిదిద్దాడు. 0.5సెంటీమీటర్ల ఎత్తు, వెడల్పుతో రెండురోజుల పాటు శ్రమించి తయారు చేసినట్లు ముసవ్వీర్ తెలిపారు. చేతివేలిపై సూక్ష్మ రూపాన్ని ప్రదర్శించి ప్రశంసలందుకున్నారు.

## రుద్రాక్షపై 108 సూక్ష్మ శివలింగాలు



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నెల్లూరుకు చెందిన ప్రముఖ సూక్ష్మచిత్రకారుడు అమీర్‌జాన్ రుద్రాక్షపై 108 సూక్ష్మ శివలింగాలను తీర్చిదిద్ది నెల్లూరుజిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. పరమేశ్వరునికి ప్రీతిపాత్రమైన రుద్రాక్షలో శివలింగాలను యాక్రిలిక్ కలర్స్ ఉపయోగించి చిత్రీకరించారు. ఎలాంటి లెన్స్ ఉపయోగించకుండా మైక్రోబ్రష్‌తో 108 శివలింగాలను తీర్చిదిద్దినట్లు అమీర్‌జాన్ తెలిపారు. దీనిని తయారు చేయడానికి ఒక గంట సమయం పట్టిందన్నారు.

## అయ్యప్పస్వామికి నీరాజన సేవ



నెల్లూరు వేదాయపాలెంలోని స్వామి అయ్యప్ప దేవస్థానంలో ఈ నెల 5న స్వామివారికి నీరాజన సేవ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు విష్ణు దత్ నంబూద్రి మేల్‌శాంతి ఆధ్వర్యంలో అర్చకులు కేరళ సంప్రదాయ రీతిలో అయ్యప్పస్వామి వారికి నీరాజన సేవ, విశేష పూజలు నిర్వహించారు. శనీశ్వర, రాహుకాల, శాంతి పూజలు జరిగాయి. స్వామి అయ్యప్ప సేవాసమాజ ప్రధాన కార్యదర్శి జి.శేషగిరిరావు పాల్గొన్నారు.




## ఎవరికి ఆదర్శం

జెఎన్‌యులో అఫ్జల్‌గురుకు వర్ధంతి సభ పెట్టి అరెస్టై జైలు నుండి బయటకొచ్చిన కన్నయకుమార్ తనకు రోహిత్ వేముల ఆదర్శం అని చెప్పుకున్నాడు. దీనిని బట్టే కన్నయ్యకుమార్ మనస్తత్వం ఏంటో అర్థమవుతుంది. ముంబై పేలుళ్ల సూత్రధారి యాకూబ్ ఈ రోహిత్ వేములకు ఆదర్శం. ఒక యాకుబ్ చనిపోతే ఇంటికొక యాకూబ్ పుడతాడన్న రోహిత్ వేముల ఆశయాలు ఎలాంటివో మనం అర్థం చేసుకోవచ్చు. నేటి తరం యువత భగత్‌సింగ్, నేతాజీ, స్వామి వివేకానంద వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలి. పిన్నవయస్సులోనే వివిధ రంగాలలో రాణించిన భారతీయ యువకులెందరో ఉన్నారు. యువతకు వాళ్లు ఆదర్శం కావాలి గాని ఉగ్రవాదులు కాదు. చిన్న వయసులో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఎన్నో అవమానాలను భరించాడు. సమాజంతో పోరాడాడు. విజయాలను సాధించాడు. తనకు ఎదురైన అవమానాలకు అంబేద్కర్ అప్పుడే ఆత్మహత్య చేసుకోవాలి. కాని అతను పోరాడి గెలిచాడు. రోహిత్ వేముల కూడా అలా పోరాడి గెలిచుంటే ఆదర్శప్రాయుడై ఉండేవాడు.

**- నళిని.సి, చెన్నై.**

## ప్రజాస్వామ్యానికి పక్షవాతం

ప్రజాస్వామ్య ద్విచక్ర శకటానికి అధికారపక్షం, ప్రతిపక్షం రెండు చక్రాలు. ఏ చక్రం డామేజ్ అయినా శకటం ప్రమాదానికి గురి అవుతుంది. టీడీపీ అర్భకులు 2019కల్లా ప్రతిపక్షం అనేది లేకుండా చేస్తారట! అంటే 2019కల్లా ప్రజాస్వామ్యానికి పక్షవాతం వస్తుంది. అధికారపక్షం నియంత అవుతుంది. ప్రజల తరఫున వాదించడానికి ప్రతిపక్షం లేకుంటే ప్రజలే తిరగబడి రాజ్యాంగ సంక్షోభానికి గురి చేస్తారు.

**- కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

## సమయోచితం

ముఖ్యమంత్రిగా చంద్రబాబు గత 20నెలల నుండి చేసిన పనులను పక్కనపెడితే ఉచిత ఇసుక విధానం బాగుంది. పేదల నుండి పెద్దల వరకు తమ నిర్మాణాల కోసం పడని పాట్లు లేవు. సిమెంట్ కన్నా ఇసుక రేటు పెరిగింది. రేటు పెరగడంతో ఇసుక దొంగతనాలు కూడా పెరిగాయి. ఆటోల్లో రిక్షాల్లో ఇసుకను బస్తాలుగా కట్టి తోలుతున్నారు. ఎన్టీఆర్ చెప్పినట్లు ప్రకృతి ప్రసాదాలైన నీరు, ఇసుకను అందరికీ ఉచితంగా ఇవ్వడం ధర్మం. మన ఇసుక ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా గట్టి చర్యలు తీసుకోవాలి.

**- వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

# వెళ్లిన భూపాల్... వచ్చిన విశాల్!




**నెల్లూరుజిల్లా ఎస్పీ వివాదానికి ఎట్టకేలకు తెరపడింది. జిల్లా ఎస్పీగా వున్న గజరావ్ భూపాల్‌ను ప్రభుత్వం సిఐడి ఎస్పీగా బదిలీ చేసింది. కొత్త ఎస్పీగా కర్నాటకకు చెందిన 2010బ్యాచ్ ఐపిఎస్ అధికారి విశాల్ గున్నిని నియమించడం, ఆయన 6వ తేదీన నెల్లూరులో 40వ ఎస్పీగా బాధ్యతలు తీసుకోవడం కూడా అయిపోయింది. నెల్లూరులో మైనార్టీ వర్గీయులతో వచ్చిన వివాదం కారణంగా గజరావ్ భూపాల్‌ను నెలరోజుల పాటు విధులకు దూరంగా పెట్టి ఎట్టకేలకు బదిలీ చేశారు. ఆ గొడవే లేకుంటే భూపాల్ బదిలీ ఇప్పుడే ఉండకపోవచ్చు.**

ఇక కొత్త ఎస్పీ విశాల్ గున్ని యువకుడు. ఎస్పీగా నెల్లూరు జిల్లానే అతని మొదటి పోస్టింగ్. మనిషిలో పనిచేయాలనే తపన కనిపిస్తోంది. ఇప్పటివరకు రాష్ట్రంలో నర్సీపట్నం ఏఎస్పీగా, బెటాలియన్ కమాండెంట్‌గా, విశాఖపట్నంలో ఓఎస్‌డిగా విధులు నిర్వహించాడు, అన్ని చోట్ల కూడా మంచిపేరు తెచ్చుకున్నాడు. ముఖ్యంగా ప్రజలను గౌరవించే గుణం వుంది. ప్రజల సహకారం, సమన్వయంతోనే పోలీసుశాఖ పనితీరును బాగా మెరుగు పరుస్తానని బాధ్యతలు చేపట్టిన రోజే చెప్పాడు. కొత్తగా వచ్చిన ఆఫీసర్లు అరాచకశక్తుల తొక్క తీసి తోలు పెరుకుతామని, దుర్మార్గుల గుండెల్లో నిద్రపోతామని చెబుతుంటారు, కొద్దిరోజుల తర్వాత ఆ టెంపో కనిపించదు. విశాల్ గున్ని మాత్రం చాలా ప్రశాంతంగా తన పని విధానాన్ని చెప్పాడు. సామాన్య ప్రజలకు కూడా తన సెల్‌ఫోన్ నెంబర్ చెప్పేసి ఎవరైనా సరే తనకు ఫోన్ చేయొచ్చని చెప్పాడు. చట్టాలను ఎవరు అతిక్రమించినా సహించేది లేదని అంటూ ప్రజలు, మీడియా సహకారంతో ముందుకెళతామని, పోలీసు శాఖలో లోటుపాట్లను సరిదిద్ది, మరింత సమర్ధవంతంగా పని చేయిస్తానని చెప్పారు.

ఏ ఆఫీసర్‌కైనా మంచిపేరు తెచ్చుకోవడానికి గాని, చెడ్డపేరు తెచ్చుకోవడానికి గాని నెల్లూరుజిల్లా ఓ అవకాశం. ఇక్కడ పనిచేసి మంచిపేరు తెచ్చుకుంటే ఆ గుర్తింపు శాశ్వతంగా వుండిపోతుంది. 1999 ప్రాంతంలో కె.శ్రీనివాసరెడ్డి అనే ఐపిఎస్ అధికారికి ఎస్పీగా నెల్లూరుజిల్లాలోనే మొదటి పోస్టింగ్. ఏడా దిన్నరకాలం మాత్రమే అతను ఇక్కడ పనిచేసినా ఈ జిల్లా ప్రజలు ఆయనను ఇంకా మరచి పోలేదు. విశాల్‌గున్ని కూడా ఆయనంత వయసులోనే ఎస్పీగా నెల్లూరులో బాధ్యతలు చేపట్టాడు. ఇక్కడ సక్సెస్ అయితే ఇక ఆయనకు ఎక్కడా తిరుగుండదు.

నేరాల పరంగా పెద్దగా ఆందోళన చెందాల్సిన జిల్లా కూడా కాదిది. రౌడీయిజం, మావోయిజం, ఫ్యాక్షనిజం లేవు. చిల్లర నేరా లెక్కువ. చైన్ స్నాచింగ్‌లు, లైంగిక నేరాలు, సివిల్ తగాదాలు, ఆస్తి గొడవలు... కొంచెం ఎక్కువగా వుంటాయి. చాలా తక్కువ గ్రామాలలో రాజకీయ కక్షలున్నాయి. ఇక నెల్లూరు నగరంలో ట్రాఫిక్ అన్నింటికంటే పెద్ద సమస్య. ముఖ్యంగా పబ్లిక్‌లో పోలీసు భయం లేదు. అడ్డదిడ్డమైన ట్రాఫిక్‌కు అదే కారణం. కొత్త ఎస్పీ ఉచ్చపోయిస్తున్నాడ్రా... అనే భయం వస్తే చాలు... అడ్డదిడ్డమైన ట్రాఫిక్ కూడా సక్రమంగా నడుస్తుంది. ఎస్పీగా విశాల్‌గన్ని తాను పనిచేయడమే కాదు, తన అధికారులు, సిబ్బంది చేత సక్రమంగా పని చేయిస్తే చాలు... ఆటోమేటిక్‌గా జిల్లా పోలీసు శాఖ సమర్ధవంతంగా పనిచేస్తుందనే సందేశం ప్రజల్లోకి వెళ్లిపోతుంది. పోలీసులు లాఠీ పట్టి డ్యూటీ చేస్తున్నారంటే చాలు... ఈ జిల్లా చాలావరకు ప్రశాంతంగానే వుంటుంది.

# కేకలు, కవ్వింపులు లేకుండా... జడ్పీ సమావేశం





నెల్లూరుజిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 6వ తేదీన జడ్పీ సమావేశ మందిరంలో ఎటువంటి కేకలు, రచ్చలు లేకుండా ప్రశాంతంగా జరిగిపోయింది. జడ్పీ ఛైర్మెన్ బి.రాఘవేంద్రరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం.జానకి, సిఇఓ బి.రామిరెడ్డిలతో పాటు ఎమ్మెల్సీలు వాకాటి నారాయణరెడ్డి, బీద రవిచంద్ర, యండపల్లి శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్, జడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరయ్యారు. జిల్లాలో అక్రమంగా జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలు, నీరు – చెట్టు పథకంలో అక్రమాలు, ధాన్యానికి గిట్టుబాటు ధరలు వంటి అంశాలపై సభ్యులు ఎక్కువగా మాట్లాడారు. గ్రావెల్ అక్రమాలను అడ్డుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. అలాగే గత సమావేశా లలో ఇచ్చిన హామీలను పలువురు సభ్యులు సమావేశంలో ప్రస్తా వించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే ఇంటర్మీడియేట్‌ను కూడా ప్రవేశపెట్టడం, జడ్పీ హైస్కూళ్లలో కంప్యూటర్ విద్యను అభివృద్ధి చేయడానికి జడ్పీ నిధులను కేటాయించాలని తీర్మానించారు. అలాగే 2016–17 సంవత్సరానికి 216,86,63,00 రూపా యలు ఆదాయంగా తీసుకుని బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 216,80,11,00 రూపాయలు వ్యయం అవుతుందని అంచనా వేశారు. పార్లమెంటు మరియు శాసనసభ సమావేశాలు జరుగు తుండడం వల్ల ఎంపీలు, ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ఈ సమా వేశానికి రాలేకపోయినట్లు తెలుస్తోంది.

## ఉచిత ఇసుక

# పేదలకా? పెద్దలకా??



ఇసుకను ఉచితంగా ప్రక టించేసి చంద్రబాబు ప్రజలను ఆశ్చర్యంలో ముంచేశాడు. ఇది వూహించని పరిణామమే. ఓ పక్క ఇసుక రీచ్‌లకు టెండర్లు పిలిచేసి, డిడిలు కూడా తీసు కుని ఇక కాంట్రాక్టర్లకు ఇసుక రీచ్‌లను కేటాయించాల్సిన తరుణంలో చంద్రబాబు హఠాత్తుగా ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఉచిత ఇసుక పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు ఊరడింపు వంటిదే! అయితే ఉచిత ఇసుకలో చంద్రబాబు ఆలోచన వెనుక ఎంతో లోతైన విషయాలున్నాయి. ఉచిత ఇసుక వల్ల రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలకంటే కూడా నిర్మాణ కంపెనీలకే అధికలాభం చేకూరనుంది. తమ అవసరాల నిమిత్తం పేద ప్రజలు వాడుకునే ఇసుక చాలాతక్కువ పరిణామంలో ఉంటుంది. కాని పెద్దోళ్లు వాడుకునే ఇసుక వందల కోట్ల విలువ చేస్తుంది. ముఖ్యంగా అమరావతి రాజధాని కోసమే ఇసుకను ఉచితం చేసారనేది సమాచారం. ఇసుక పాటల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం రెండొందల నుండి మూడొందల కోట్లు. చంద్రబాబు గోదావరి పుష్కరాలకు పెట్టిన ఖర్చే 2వేల కోట్లు. కాబట్టి చంద్రబాబు పెట్టే ఖర్చుకు ఇసుక డబ్బులు ఓ పక్కకు కూడా చాలవు. పైగా ఇసుక దోపిడీతో ప్రభుత్వంపై వ్యతిరేకత రావడం గ్యారంటీ! అధికార పార్టీ నేతల అండతో ఇసుక మాఫియా చెలరేగిపోతుందని మీడియాలో రోజూ వార్తలు... దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వల్ల ఇప్పటికే ప్రభుత్వం గబ్బుపట్టింది. ఇసుకరీచ్‌లను వేలం వేసి అప్పగిస్తే రాష్ట్రం నిండా చాలామంది చింతమనేని ప్రభాకర్‌లు తయారయ్యే అవకాశముంది. ఇక అమరావతి రాజధానిలో శరవేగంగా నిర్మాణాలు జరగాలన్నా, చంద్రబాబు అనుచరులు తీసుకున్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ముందుకు కదలాలన్నా ఇసుక అవసరం ఎంతో వుంది. రాజధాని నిర్మాణాలకైనా, ప్రాజెక్ట్‌లకైనా కొన్ని వందలకోట్ల విలువచేసే ఇసుక అవసరమవుతుంది. ఇప్పుడు ఆ ఇసుక అంతా కూడా వీరికి ఫ్రీ. దీనివల్ల రాజధానిలో నిర్మాణాలు కూడా వేగమందు కుంటాయని చంద్రబాబు ఆలోచన చేశాడు. ఇసుకను వేలం వేయడంకంటే ఫ్రీ చేస్తే ప్రయోజనాలు అధికంగా వున్నాయి కాబట్టే చంద్రబాబు ఇసుకను ఉచితం చేశాడు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


# రక్తం మరిగిన రహదారి

## తిరుపతి - నాయుడుపేట రోడ్డులో ప్రయాణం క్షణక్షణం ప్రాణాంతకమే!

పుణ్యం కోసమని పుణ్యక్షేత్రాలకు పోతూనో, పోయి వస్తూనో ప్రమాదాల బారినపడి ఎందరో పుణ్యాత్ములు పుణ్య లోకాలకు పోతున్నారు. దేవుడి దర్శనం కోసం బయలుదేరిన వాళ్లను ఆ దేవుడే తన వద్దకు తీసుకెళుతుంటాడు. దేవుళ్లు కొలువైన ఈ దారిలో వారి వెంటే మృత్యు దేవత కూడా కొలువైవుంది. ఎంతోమంది ప్రయాణీకులను తన అక్కున చేర్చుకుం టోంది. ప్రమాదాలకు, విషాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఆ రహదారి ఎక్కడో కాదు... నెల్లూరు–చిత్తూరు జిల్లా మధ్యలో నాయుడుపేట – తిరుపతిల మధ్యే వుంది. ఈ రహదారి ప్రమాదాల నిలయంగా మారుతోంది. మొన్ననే ఓ గ్రానైట్ లారీని కారు ఢీకొన్న దుర్ఘటనలో కొందరు ప్రాణాలు కోల్పోవడం తెలిసిందే! ఇది కొత్తగా జరిగింది కాదు. ఆఖరిది కూడా కాదు. ఈ రోడ్డును అర్జంట్‌గా నాలుగులైన్ల రహదారిగా అభివృద్ధి చేయకుంటే మాత్రం ఇలాంటి ప్రమాదాలకు లెక్కే ఉండదు.

నాయుడుపేట–తిరుపతి రహదారి రాష్ట్రంలోనే అత్యంత ప్రాధాన్యత కలిగినది. తిరుపతి, శ్రీకాళహస్తి, కాణిపాకం, తిరుచా నూరు వంటి పుణ్యక్షేత్రాలకు ప్రధాన మార్గం. ఏపిలోని కోస్తాంధ్ర 9జిల్లాల నుండి బెంగుళూరు వెళ్లే బస్సులకుగాని, ఇతర వాహనాలకు గాని ఇదే ప్రధాన మార్గం. తిరుపతి, శ్రీకాళహస్తిలకు ప్రతి రోజూ వేలసంఖ్యలో వాహనాలు వెళ్తం టాయి. ఇక రాత్రి సమయాలలో బెంగు ళూరుకు వెళ్లే, లేదా బెంగుళూరు నుండి వచ్చే వాహనాలుగాని వేలసంఖ్యలో ఉం టాయి. దాదాపు జాతీయ రహదారితో సమానంగా ఈ రహదారిపై ట్రాఫిక్ నడుస్తుంది. ఇన్ని వేల వాహనాలతో రద్దీగా ఉండే ఈ రోడ్డు ఇంకా డబుల్‌రోడ్డుగానే వుంది. ఈ రహదారిపై వాహనాల సంఖ్య అంతకంతకు పెరుగుతుండడంతో నాయుడుపేట – తిరుపతి, బెంగుళూరుల మధ్య ప్రయాణకాలం కూడా పెరుగు తోంది. డబుల్‌రోడ్డు కావడం, వాహనాలు ఎక్కువ కావడంతో వాహనాలు ఓవర్ టేక్ చేసే సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టడం వంటి ప్రమా దాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అంతే కాక పలు దాబాలు, హోటళ్ల వద్ద రోడ్డు పైనే వాహనాలను నిలుపుతున్నందువల్ల కూడా ప్రమాదాలు పెరుగుతున్నాయి.

అత్యవసరంగా విస్తరించాల్సిన రహ దారులలో ఇది అత్యంత ముఖ్యమైనది. ఈ రహదారిని వీలైనంత త్వరగా నాలుగు లైన్ల రహదారిగా మార్చడానికి ప్రభుత్వం చొరవచూపాల్సి వుంది.




# కలెక్టర్ జానకికి ఉత్తమ పురస్కారం



నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పరిపాలనలో వైవిధ్యం, పనిలో వేగం చూపిస్తూ, అందరి ప్రశంసలు అందుకుంటున్న శ్రీమతి యం.జానకి ఇప్పుడు 'బెస్ట్ అడ్మినిస్ట్రేటర్' అవార్డును కూడా అందుకున్నారు. ఈనెల 8వతేదీన కర్నూలులో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలలో ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఆమె ఈ అవార్డునందుకుని ఆయన అభినందనలను కూడా స్వీకరించారు. ఉత్తమ పరిపాలనాధికారిగా పేరుతో పాటు అవార్డును కూడా తెచ్చుకున్న జానకికి 'లాయర్' అభినందనలు.

## బిఎస్ఎన్ఎల్ పిజిఎం రవిబాబు



బిఎస్ఎన్ఎల్ నెల్లూరు జిల్లా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్‌గా ఎం.రవిబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చెన్నైలో మానవ వనరుల శాఖలో జిఎంగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడకు బదిలీ అయ్యారు. ఆయన సొంతూరు వెంకటగిరే! 1989లో ఇండియన్ టెలికం సర్వీసెస్‌కు ఎంపికయ్యారు. శిక్షణ కూడా నెల్లూరుజిల్లాలోనే పొందారు. దేశంలోని పలు ప్రాంతాలలో పని చేసి ఈరోజు సొంత జిల్లాకు వచ్చారు.

## సిపిఓగా మూర్తి

నెల్లూరుజిల్లా ప్రణాళికశాఖాధికారిగా టిబికె మూర్తి బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం సిపిఓగా పనిచేస్తూ ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు. నెల్లూరులో పని చేస్తున్న గురుమూర్తి హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు.

## కాంగ్రెస్ నేతల ఛలో ఢిల్లీ

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా పోరాటంలో భాగంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ నెల 12వ తేదీన ప్రత్యేక రైలులో ఢిల్లీ బయలుదేరుతున్నారు. 14, 15, 16తేదీలలో వీరు ఢిల్లీలో వుండి రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర హోంమంత్రి, ఆర్థికమంత్రి, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలని కలిసి ఏపికి ప్రత్యేకహోదాతో పాటు విభజన హామీలను అమలు చేయాలని కోరుతూ వినతి పత్రాలు అందించే కార్యక్రమాలలో పాల్గొననున్నారు.

## నెల్లూరు కబుర్లు

## పెన్నలో శివనామస్మరణ



పినాకిని స్విమ్మర్స్ అసోసియేషన్ వాళ్లు ప్రతి సంవత్సరం శివరాత్రిరోజు నెల్లూరులోని పెన్నానదిలో ఇసుకతో శివలింగాన్ని ప్రతిష్ఠించి పెద్దఎత్తున పూజలు చేస్తుంటారు. మొన్న సోమవారం శివరాత్రి నాడు కూడా సైకత శివలింగాన్ని రూపొందించి విశేషపూజలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు మోపూరు పెంచలయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, కార్పొరేటర్లు అయిన పి.రూప్‌కుమార్‌యాదవ్, నూనె మల్లిఖార్జునయాదవ్, జిల్లా రైస్ మిల్లర్స్ సంఘం కార్యదర్శి నాగేశ్వరరావు, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జె.ఎల్.సత్యం, విశ్వబ్రాహ్మణ సంఘం కార్యదర్శి శేషు, బిజెవైఎం నాయకులు కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## టిఎన్ఎస్ఎఫ్ పరీక్ష సామాగ్రి



తెలుగునాడు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరు రంగనాయకులపేటలోని సెయింట్ పీటర్స్ హైస్కూలులో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమయ్యే స్టేషనరీని అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షులు కె.తిరుమలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, అధికార ప్రతినిధి డాక్టర్ జడ్.శివప్రసాద్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ప్రేమ్‌కుమార్‌రెడ్డి, స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆంధోనిరెడ్డి పాల్గొని విద్యార్థులకు స్టేషనరీ అందించారు.

## మహిళా దినోత్సవాన పారిశుద్ధ్య సిబ్బందికి సత్కారం



ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవా సమితి వారు నెల్లూరు నగరపాలక సంస్థలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న పదిమంది మహిళలను చీర, రవిక, పండ్లు, స్వీట్స్ అందజేసి శాలువాలు పూలమాలలతో సత్కరించారు. సమితి సభ్యుడు కమతం అశోక్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు లేనిదే ఈ సృష్టి లేదని, మహిళలు అన్ని రంగాలలోనూ రాణించినప్పుడే ఈ సమాజం బాగుపడుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు నౌషద్, మనోజ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసాఫీసులో మహిళా దినోత్సవం

### మహిళా సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ



ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలోనూ ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి ఎస్పీ విశాల్‌గున్నీ శుభాకాంక్షలు తెలపడమేకాక అందరికీ స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు పురుషులకు ఏ మాత్రం తీసిపోరని, అన్ని రంగాల్లో ధీటుగా రానిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు అనుకుంటే సాధించలేనిది ఏమీ లేదని, ఈరోజు పలు రంగాల్లో పురుషుల కంటే కూడా మహిళలే ప్రతిభాపాటవాలతో ముందడుగు వేస్తున్నారన్నారు. జిల్లాలో శాంతిభద్రతలను కాపాడడానికి, మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రెడ్డి గంగాధర్, కార్యాలయ ఏఓ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ కోటారెడ్డి, సెక్షన్ సూపరింటెండెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సింహపురిలో చర్మవ్యాధుల విభాగం



నెల్లూరు రూరల్ చింతారెడ్డిపాలెంలో వున్న సింహపురి ఆసుపత్రిలో చర్మవ్యాధుల విభాగాన్ని ప్రారంభించినట్లు ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ కాటంరెడ్డి రవీంద్రరెడ్డి తెలిపారు. ఈనెల 5వతేదీ విలేకర్లతో ఆయన మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చర్మవ్యాధుల విభాగంలో మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి కుమార్తె డాక్టర్ చేతన వైద్యసేవలను అందించనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో మాజీకేంద్రమంత్రి పనబాక లక్ష్మి, ఆసుపత్రి సిఏఓ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు రైల్వే డిఎస్పీగా మోహన్‌రావు

నెల్లూరు రైల్వే డిఎస్పీగా మోహన్‌రావు ఈ నెల 5వ తేదీ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం రైల్వే డిఎస్పీగా పని చేస్తున్న రమేష్‌బాబును డిజిపి విఆర్‌కు బదిలీ చేస్తూ, ఆయన స్థానంలో డిజిపి విఆర్‌లో వున్న మోహన్‌రావును నియమిస్తూ డిజిపి వెంకటరాముడు ఆదేశాలు జారీ చేశారు. నెల్లూరు రైల్వే సిఐ నరసింహరాజు, సిబ్బంది పుష్ప గుచ్ఛాలు అందించి మోహన్‌రావును అభినందించారు.

## రైతుకు అండ 'రైతుమిత్ర'




నెల్లూరు అపోలో స్పెషాలిటి ఆసుపత్రిలో మంగళవారం 'రైతుమిత్ర' ప్రివిలేజ్ కార్డును నెల్లూరుజిల్లా అదనపు జాయింట్ కలెక్టర్ రాజ్‌కుమార్ ప్రారంభించారు. అపోలో సంస్థ ప్రవేశపెట్టిన రైతుమిత్ర కార్డు నెల్లూరు జిల్లాలోని ప్రతి ఒక్క రైతు పొంది ఉండాలనే సదాశయంతో ఏర్పాటు చేశామని, ఈ కార్డు రైతు కుటుంబ సభ్యులందరికీ ఉపయోగపడుతుందని ఆసుపత్రి వర్గాలు తెలియజేశాయి. ఈ కార్డులను జిల్లాలోని అన్ని గ్రామాలు, మండలాల రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్డుతో రైతులు, వారి కుటుంబసభ్యులు అన్ని రకాల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక డిస్కౌంట్‌తో చెకప్ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి రాష్ట్ర సెక్రటరి సిఎస్ఆర్ కోటిరెడ్డి, బెజవాడ ఓబుల్‌రెడ్డి, అపోలో స్పెషాలిటి హాస్పిటల్స్ మెడికల్ సూపరింటెండెంట్ శ్వేతారెడ్డి, యూనిట్ హెడ్ నవీన్‌లు పాల్గొన్నారు.



# నమ్మకానికి చిరునామా... నెల్లూరోళ్లనిపించారు!

***2014 ఎన్నికల్లో వైకాపాకు అత్యధిక సీట్లు సాధించింది కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు. ఈ నాలుగు జిల్లాలు కూడా ఆరోజు జగన్ వెంట నడిచాయి. అయితే ఈరోజు ఈ నాలుగు జిల్లాలలో మూడు జిల్లాల ఎమ్మెల్యేలు దారి తప్పారు.***

వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సొంత గడ్డ కడప జిల్లాలో ఇద్దరు ఎమ్మెల్యేలు వైకాపాను వీడి తెలుగుదేశంలో చేరారు. కర్నూలు జిల్లా నుండి దగ్గర బంధువైన భూమా నాగిరెడ్డి, ఆయన కుమార్తె అఖిలప్రియలు తెలుగుదేశంలో చేరారు. ప్రకాశం జిల్లా నుండి ఒక ఎమ్మెల్యే వెళ్లిపోయాడు. కాని నెల్లూరుజిల్లాలోని ఏడుమంది ఎమ్మెల్యేలు విశ్వాసానికి చిరునామాగా నిలిచారు. జగన్‌ను వీడిపోయేదే లేదని ఎవరికి వాళ్ళు ప్రకటనలిచ్చారు. ఈ కష్టకాలంలో కూడా జగన్‌ను వెన్నంటివున్న నెల్లూరు ఎమ్మెల్యేలకు పార్టీలోనూ ప్రశంసలందుతున్నాయి. ఈరోజు వరకైతే జగన్ వెంట నెల్లూరు ఎమ్మెల్యేలు గట్టిగానే నిలబడ్డారు. రేపు ఏం జరుగుతుందనేది ఎవరూ చెప్పలేరు!


## రక్షణ ఎగుమతులే లక్ష్యం!

**- సతీష్‌రెడ్డి**



భారత రక్షణశాఖ మంత్రి శాస్త్రీయ సలహాదారు, నెల్లూరుజిల్లా వాసులు గర్వించదగ్గ శాస్త్రవేత్త గంట్ర సతీష్‌రెడ్డి ఈనెల 5వతేదీన తన సొంతూరైన ఆత్మకూరు మండలంలోని మహిమలూరు కొచ్చారు. గ్రామంలోని విఎన్ఆర్ జడ్పీ హైస్కూల్ వార్షికోత్సవంలో పాల్గొని విద్యార్థులను ఉత్తేజపరిచే విధంగా సందేశమిచ్చారు. అంతకుముందు ఆత్మకూరులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్షణ రంగంలో స్వయం సమృద్ధి దిశగా భారత్ ముందడుగు వేస్తుందని, మేకిన్ ఇండియా పథకం దీనికి బాటలు వేస్తుందని అన్నారు. రక్షణ రంగంలో త్వరలో మనం దిగుమతులు తగ్గించుకుని రక్షణ ఉత్పత్తులను ఎగుమతి చేసే దిశగా కొనసాగుతున్నామన్నారు. ప్రపంచంలోని అగ్రశ్రేణి కంపెనీలన్నీ భారత్‌లోనే పెట్టుబడులు పెట్టి, ఇక్కడ నుండే ఉత్పత్తులకు శ్రీకారం చుట్టాయని సతీష్‌రెడ్డి చెప్పారు. ఎగుమతులు పెరిగితే దేశీయ పరిశ్రమలకు ఎంతో మంచిభవిష్యత్ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## మినీబైపాస్... మినీ మార్కెట్!



ఒకప్పుడు రాజీవ్‌మార్గ్‌గా, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్దార్ వల్లభాయ్ పటేల్ రోడ్డుగా పేర్లు మార్చుకున్న నెల్లూరులోని మినీబైపాస్ రోడ్డు అన్ని వ్యాపారాలకు ఒక మినీమార్కెట్‌గా మారుతోంది. నాలుగైదేళ్ల క్రితం దాకా ఈ రోడ్డు పక్కన పెద్దగా వ్యాపార సందడి ఉండేది కాదు. కాని ఇటీవలకాలంలో పేరుమోసిన బంగారు దుకాణాలు, గుడ్డల అంగళ్లు ఈ రోడ్డు పక్కనే వెలిశాయి. కల్యాణ మండపాలు నిర్మించబడ్డాయి. ఇప్పుడు రోడ్డు వెంబడి చిరు వ్యాపారాలు ఎక్కువవుతున్నాయి. కడియం వాళ్ళు మినీబైపాస్‌ను ఆనుకుని వున్న సర్వేపల్లి కాలువ కట్ట స్థలంలో నర్సరీలు పెట్టుకుని



పూలమొక్కలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోడ్డు పక్కనే ఫర్నీచర్స్, బొమ్మలు వంటివి అమ్ముతున్నారు. ఈ మధ్య మొబైల్ టిఫిన్ సెంటర్‌లు, మొబైల్ కొబ్బరి బోండాల దుకాణాలు ఎక్కువయ్యాయి. ఇక ఈ రోడ్డులో పెద్ద పండ్ల మార్కెట్టే నడుస్తోందని చెప్పవచ్చు. జ్యోతిరావ్ పూలే బొమ్మ నుండి బి.వి.నగర్ సెంటర్ దాకా రోడ్డు పక్కన మొబైల్ పండ్లషాపులు, కూరగాయల కొట్లు బ్రహ్మాండంగా వెలిశాయి. ఇక హోటళ్లు, గ్రానైట్ షాపులకు లెక్కేలేదు. మొత్తానికి మినీబైపాస్ పెద్ద మార్కెట్ సెంటరైపోయింది.

## నెల్లూరురోడ్లపై తిరిగిన ఎస్పీ



జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పక్కరోజే విశాల్‌గున్ని నెల్లూరు రోడ్ల మీదకు వచ్చారు. రోడ్లపై అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసివున్న వాహనాలను చూడడంతోటే ఆయనకు నెల్లూరు ట్రాఫిక్ పరిస్థితి అర్థమైపోయింది. నిర్దేశించిన స్థలాల్లోనే వాహనాలను పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపితే చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని పలు కూడళ్ల వద్ద ట్రాఫిక్ స్థితిగతులను పరిశీలించి, ఏమేం చర్యలు తీసుకోవాలనే దానిపై సిబ్బందికి సూచనలిచ్చారు. అలాగే ఎస్పీ రెండు, మూడో నగర పోలీసుస్టేషన్‌లను తనిఖీ చేశారు. నవాబుపేట, మూలాపేటలలో నిర్మాణంలో వున్న పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోనూ పలు మార్పులు చేపట్టారు. కార్యాలయం మెయిన్‌గేటు వద్దే సెంట్రీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఇక పోలీసు కార్యాలయంలోకి వెళ్లేవారెవరైనా ప్రధాన ద్వారం వద్దే తమ వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

దాదాపు నెలరోజుల పాటు ఎస్పీ విధులకు దూరంగా ఉండడంతో ఏఎస్పీనే ఇన్‌ఛార్జి ఎస్పీగా వ్యవహరిస్తూ వచ్చారు. గ్రీవెన్స్‌డేను సైతం ఏఎస్పీనే నిర్వహించారు. ఎస్పీ క్యాంపు కార్యాలయం బోసిపోయినట్లు ఉండింది. విశాల్ గున్ని ఎస్పీగా వచ్చాక మళ్ళీ జిల్లా పోలీసు కార్యాలయంలోను, ఎస్పీ క్యాంపు కార్యాలయంలోను సందడి మొదలైంది. కొత్త ఎస్పీని కలిసే వారితో క్యాంపుఆఫీసు రద్దీగా ఉంటోంది.

### వైయస్సార్ నగర్‌లో

## సమస్యలు పరిష్కరించండి

**- అసెంబ్లీలో కోటంరెడ్డి**



నెల్లూరులోని వైయస్సార్ నగర్‌లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను 8వ తేదీ అసెంబ్లీలో లేవనెత్తాడు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. 7వేల ఇళ్లున్న వైయస్సార్ నగర్‌లో రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీ, మంచినీటి సదుపాయాలు లేవు. కనీస సౌకర్యాలు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. యుద్ధ ప్రాతిపదికన వీధి లైట్లు వేసి, మంచినీటి సౌకర్యం కల్పించాలి. ఈ కాలనీలో కనీస సౌకర్యాలకు తక్షణం 64కోట్ల రూపాయలు కేటాయించాలని ఆయన అసెంబ్లీలో డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన మంత్రి కిమిడి మృణాళిని కనీస వసతుల ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## విఆర్‌సి వాకర్స్ మహిళా సదస్సు



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నెల్లూరు విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8న మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి మాట్లాడుతూ, మహిళా ఆర్థిక సాధికరత వైపు దేశం పయనిస్తోందన్నారు. మహిళలు దేశగౌరవాన్ని పెంపొందించేవిధంగా ఉన్నతస్థాయిని సాధిస్తూ, అనేకరంగాల్లో ప్రతిభాపాటవాలతో రాణిస్తున్నారన్నారు. అయితే, కొన్ని సందర్భాల్లో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని, ప్రభుత్వాలు మహిళ భద్రతా చట్టాలను మరింతగా పటిష్టం చేయాలని అన్నారు. తొలుత, మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ మహిళా అధ్యక్షురాలు అనూరాధ, గౌరవాధ్యక్షుడు డాక్టర్ భాస్కర్‌రావు, డాక్టర్ పెంచలయ్య, చంద్రలీల, ఎం.వి.సుబ్బారెడ్డి, రాధ, అసోసియేషన్ కార్యదర్శి వివి రమణమూర్తి, ఇ. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీల భర్తీకి పచ్చజెండా

### పూర్తి స్థాయిలో సేవలకు సిద్ధమవుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల




నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల టీచింగ్ ఆస్పత్రికి 424మంది వైద్య సిబ్బంది పోస్టులను మంజూరు చేయించినట్లు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ చాట్ల నరసింహారావు తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో మిగతా ప్రభుత్వ కళాశాలలకు సిబ్బందిని మంజూరు చేసినా, నెల్లూరు కళాశాలకు మంజూరు చేయలేదన్నారు. మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్ళగా, ఆయన సిఎం చంద్రబాబుతో మాట్లాడి పోస్టులను మంజూరు చేయించారని తెలిపారు. జిఓ నెంబరు 18ని ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. 362మంది స్టాఫ్‌నర్సులు, గ్రేడ్ 2 ల్యాబ్ టెక్నిషియన్లు 23, గ్రేడ్ 2 ఫార్మాసిస్టులు 12, మత్తు టెక్నీషియన్లు, దంత టెక్నీషియన్లు, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్లు, ఫిజియోథెరపిస్టులు నలుగురు చొప్పున, కార్డియాక్ టెక్నీషియన్లు 3, డిజిటల్ ఇమేజింగ్ టెక్నిషియన్లు 3, రిఫ్రాక్షనిస్టులు 2, ఆడియో మెట్రీషియన్, ఆడియో విజువల్ టెక్నిషియన్, వొకేషనల్ కౌన్సిలర్ ఒక్కొక్కరు చొప్పున మొత్తం 424పోస్టులు మంజూరయ్యాయని తెలిపారు. అభివృద్ధి కమిటీ సభ్యులు జ్యోత్స్నలత, సంపత్‌రాజు, అనిల్‌కుమార్‌రెడ్డి, గిరి, ప్రిన్సిపల్ కృష్ణమూర్తిశాస్త్రి, ఆసుపత్రి సూపరింటెండెంట్ భారతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మెరుగైన సేవలే లక్ష్యం

## - స్టేట్‌బ్యాంక్ బ్రాంచ్ చీఫ్‌మేనేజర్ మురళీకృష్ణ



డాక్టర్ సిఆర్‌రెడ్డిని సన్మానిస్తున్న స్టేట్‌బ్యాంకు ప్రతినిధులు

స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా శాఖల ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే తమ లక్ష్యమని గూడూరు శాఖ ముఖ్యనిర్వహణాధికారి మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలోని ఐసిఎస్‌రోడ్డులో వున్న డిఎన్‌ఆర్ కమ్యూనిటీ హాలులో ఇటీవల బ్యాంకింగ్ సేవలు, వినియోగదారుల సమస్యలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాతాదారులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు వారి సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు డాక్టర్ సిఆర్‌రెడ్డి, డాక్టర్ గంగాధర్‌రెడ్డి, విశ్రాంతి ఇంజనీర్ నాగరాజశర్మలను బ్యాంకు తరపున సన్మానించారు. బ్యాంకు నుంచి అందుతున్న సేవలపై ఖాతాదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆర్బీవో మేనేజర్ వాసుదేవరావు, పట్టణ మాలవ్యానగర్, బ్రాంచ్ నిర్వహణాధికారి మంజూర్, పిబిడి మేనేజర్ సోమేశ్వరరావు, ఉద్యోగుల సంఘ ప్రధానశాఖ కార్యదర్శి ఎంవి రమణయ్య, నాయకులు శివయ్య, అసిస్టెంట్ మేనేజర్ సుబ్బారావు, దామోదర్, సిబ్బంది, విశ్రాంతి ఉద్యోగులు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఐసిఎస్‌రోడ్డులో స్వచ్ఛందంగా ఆక్రమణ తొలగింపు

గూడూరు పట్టణంలోని ఐసిఎస్ రోడ్డులో ఆక్రమణల తొలగింపునకు అధికారులు ఆదివారం శ్రీకారం చుట్టారు. అంతకుముందే ప్రభుత్వ స్థలాలకు సంబంధించి సర్వే చేపట్టి హద్దులు నిర్ణయించారు. దీంతో భవన యజమానులు స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు భారీగా మోహరించారు. ప్రభుత్వ స్థలాలు ఉన్నమేరకు దాదాపు 66 నుంచి 70 అడుగుల వెడల్పుతో రోడ్డు ఉండేలా ఆక్రమణలు తొలగిస్తున్నామని రోడ్లు భవనాల శాఖ ఏఇ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. రెవెన్యూ, పోలీసులు ఆక్రమణల తొలగింపునకు సహకరించారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## పన్నులు సకాలంలో చెల్లించండి

### - మున్సిపల్ కమిషనర్ మోదకొండ



గూడూరు పురపాలక సంఘ పరిధిలోని పన్ను చెల్లింపుదారులు సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మోదకొండ ఓ ప్రకటనలో కోరారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నుపై అపరాధ రసుం మాఫీ ఉత్తర్వులు ప్రభుత్వం నుంచి రాలేదన్నారు. ఆస్తి పన్ను, నీటి పన్ను, తదితర పన్నులన్నింటినీ ఈ–సేవ కేంద్రాల్లో గానీ, పురపాలక కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లో గాని చెల్లించి రసీదు పొందాలని సూచించారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో నీటిశుద్ధి కేంద్రం


మాట్లాడుతున్న ట్రస్టు స్థాపకుడు హరిచంద్రారెడ్డి, ఎమ్మెల్యే సునీల్‌కుమార్ తదితరులు

గూడూరు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కనుమూరు హరిచంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్టు దాతృత్వంతో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన నీటిని తాగితేనే ఆరోగ్యంగా ఉంటామన్నారు. ట్రస్టు స్థాపకుడు హరిచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.విజయ కుమార్ మాట్లాడుతూ ఈ ట్రస్టుకు తమ కళాశాల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శనగల వెంకట్రావు, కళాశాల హెచ్‌వోడిలు శ్రీనివాసరావు, సుశీల్ కుమార్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకార్మికుల అభివృద్ధికి కృషి


చెరువులో చేప పిల్లలు వదులుతున్న ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన

మత్స్య కార్మికుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. గూడూరు చెరువులో ఆదివారం ఆర్‌విఐకె పథకం కింద ప్రభుత్వం పంపిణీ చేసిన చేపపిల్లలను చెరువులో వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్యకార్మికుల స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం ఈ పథకం ప్రవేశ పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఎఫ్‌డివో టి.శ్రీనివాసులు, మత్స్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఇన్నర్‌వీల్ క్లబ్ మహిళా దినోత్సవం



ప్రస్తుత, మాజీ మున్సిపల్ ఛైర్మెన్లకు సన్మానం చేస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులు

గూడూరు పట్టణంలోని మఠంవీధిలో ఉన్న అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ భవనంలో సోమవారం సాయంత్రం ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యాన మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనతో పాటు మాజీ మున్సిపల్ ఛైర్మెన్లు చేవూరు పద్మావతి, కోడూరు కల్పలత, యారం మంజూలు తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మైథిలి, ఆ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పొనకా సునందారెడ్డి, స్నేహలతారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

# పోలేరమ్మ ఆలయంలో మంచినీటి ట్యాంకు


సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన

గూడూరు రెండో పట్టణంలోని జానకిరాంపేటలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో వైజేపీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన మంచి నీటి ట్యాంకును ఆదివారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆ క్లబ్ చేసిన సేవలను కొనియాడారు. వైజేపీ లయన్స్ క్లబ్ ప్రతినిధులు వెంకటసుబ్బారెడ్డి, మురళీరాజు, మంజులాదేవి, గురునాథం కౌన్సిలర్ బిల్లు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్ర 'మహిళా' దినోత్సవ వేడుకలు


ఆంధ్ర మహిళా మండలి నుండి సన్మానాలందుకుంటున్న తహశీల్దార్ సత్యవతి, డా॥ సి.రోహిణి

గూడూరు పట్టణంలోని కోనేటిమిట్టలో వున్న ద్వారకామయి ఫంక్షన్‌హాలులో ఆంధ్ర మహిళామండలి ఆధ్వర్యాన మహిళా దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గూడూరు తహశీల్దార్ సత్యవతి, సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో గీతావాణి, రచయిత్రి వెడిచర్ల ప్రతిభను, డాక్టర్ సి.రోహిణిని ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో మండలి ప్రతినిధులు డాక్టర్ సి.రోహిణి, విష్ణువందన, ప్రభ, డాక్టర్లు సిఆర్‌రెడ్డి,, సి.జనార్ధన్‌రెడ్డి, కె.మునిగిరీష్, రామకృష్ణారెడ్డి, కె.సీతారెడ్డి, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న 'ఎస్టాటికా-2016' సంబరాలు



కోట మండలం, విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఎస్టాటికా–2016 సంబరాలు ఘనంగా జరిగాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ సంబరాలు శనివారంతో ముగిశాయి. ఎన్‌బికెఆర్ విద్యార్థులతో పాటు, ఇతర ఇంజనీరింగ్ కళాశాలల నుంచి కూడా విద్యార్థులు వచ్చి ఈ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, వివిధ రకాల వేషధారణలు, మిమిక్రీ వగైరా కళారూపాలన్నీ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సంబరాల్లో భాగంగా విద్యార్థులు తయారుచేసిన పలు రకాల స్టాల్స్, చిత్రలేఖన ప్రదర్శనలతో పాటు ఆటపాటలన్నీ అలరించాయి. అనంతరం ఉత్తమ ప్రదర్శనలకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు విద్యలో ప్రతిభతో రాణించడంతో పాటు, క్రీడలు, కళల పట్ల కూడా ఆసక్తి చూపాలని, వీటిద్వారా మానసిక ఉల్లాసం కలగడమే కాక జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందన్నారు. విద్యార్థులంతా కష్టపడి చదువుకుని ఉన్నతస్థాయిలో రాణించి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఇలాంటి సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవాలను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారన్నారు. ఎస్టాటికా సంబరాలను విజయవంతం చేసినందుకు ఆయన ఈ సందర్భంగా విద్యార్థులందరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టాటికా కన్వీనర్ బి. రాజేంద్రప్రసాద్‌తో పాటు పలువురు అధ్యాపకులు, విభాగ అధిపతులు, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## మేషం


అశ్వని, భరణి, కృతిక 1 పాదము

దూర ప్రయాణాలు నిర్ణయం కాగలవు. యజమానులు వర్కర్లతో జాగ్రత్తగా మెలగాలి. కోర్టు కేసులు వాయిదా పడతాయి. పనులు నిదానంగా జరుగుతున్నా సానుకూలం కాగలవు. ఆర్థికస్థితి బాగుండి వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం బాగుంటుంది. కొన్ని అదనపు ఖర్చులు తప్పనిసరి. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. మీదికాని విషయాలకు దూరంగా వుండండి.

## కన్య


ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

అవసరాలకు ఋణాలు లభించి పనులు జరిగిపోతాయి. ఆదాయం సంతృప్తికరము. అనుకున్న పనులను శ్రమపడి సాధించుకొంటారు. స్థిరాస్తులు కొనడం, కొత్త పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలు, వ్యాపార విస్తరణలకు అనుకూల సమయం. మాట స్పీడు, తొందరపాటు వ్యవహారాలు తగ్గించుకొనండి. ప్రభుత్వ అనుమతులు లభిస్తాయి. శుభకార్యాలకు సమాయత్తం కాగలరు.

## వృశ్చికం


విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అవసరాలు, చెల్లింపులు వాయిదా వేసికొనడం మంచిది. ఉద్యోగులు తమ అధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుంది. అవసరాలకు ఋణం చేయక తప్పదు. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడవచ్చును. అనుకోని సమస్యలు ఎదురు కావచ్చును. ప్రభుత్వ అనుమతులు లభిస్తాయి.

## వృషభం


కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఉద్యోగులకు పైవారి వత్తిడి, పనిభారం ఎక్కువగా ఉంటుంది. దైవ, సేవా కార్యక్రమాలలో పాల్గొనడం, ప్రధానపాత్ర వహించడం ఉంటుంది. ఆర్థికంగా ఇబ్బంది దినాలివి. వృత్తి వ్యాపారాలు చేసేవారికి సంతృప్తి ఉండదు. ఆదాయం తగ్గుతుంది. ఏదో ఒక రూపంలో అదనపు ఖర్చులు తప్పవు. మీపై విమర్శలు చేసేవారుంటారు జాగ్రత్త వహించండి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 11.3.2016 నుండి
తేది. 17.3.2016 వరకు

ఈ వారము నందు మీనమేష వృషభ మిధున రాశులందు చంద్రుడు, సింహంలో గురు రాహువులు, వృశ్చికంలో శనికుజులు, కుంభంలో కేతుబుధశుక్రులు, మీనంలో రవి సంచరిస్తారు.

**పంచాంగము:**
ముహూర్తములు లేవు

**ఫాల్గుణ మాస శుక్లపక్షతిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 11 | శుక్ర | తదియ | రా॥ గం.1.22ని॥ |
| తేది. 12 | శని | చతుర్థి | రా॥ గం.10.58ని॥ |
| తేది. 13 | ఆది | పంచమి | రా॥ గం.8.39ని॥ |
| తేది. 14 | సోమ | షష్ఠి | రా॥ గం.6.30ని॥ |
| తేది. 15 | మంగళ | సప్తమి | సా॥ గం.4.34ని॥ |
| తేది. 16 | బుధ | అష్టమి | ప॥ గం.2.58ని॥ |
| తేది. 17 | గురు | నవమి | ప॥ గం.1.46ని॥ |

## ధనుస్సు


మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

నూతన వస్తువులను సమకూర్చుకొంటారు. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. బంధుమిత్రులను ప్రముఖులను కలుసుకొంటారు. కుటుంబంలో చిన్నచిన్న సమస్యలుండి సర్దుబాటు కాగలవు. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి, ఆర్థికావకాశాలు దొరికి ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలు, ఉద్యోగార్థులకు అవకాశాలు దొరుకుతాయి.

## మిధునం


మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కార్యసాధనలో జయం పొందుతారు. కొత్త వస్తువులు సమకూర్చుకొనడం, ప్రముఖులను బంధువర్గాన్ని కలుసుకొనడం, శుభకార్యాలను నిర్ణయం చేయడం జరుగుతుంది. వ్యాపారపరంగా అవకాశాలు దొరికి ఆదాయం పెరుగుతుంది. అయినా అదనపు ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. కాంట్రాక్టర్లు పరిశ్రమ యజమానులు తమ వర్కర్లతో జాగ్రత్తగా ఉండండి.

## మకరం


ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగులకు విధి నిర్వహణలో గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. ప్రభుత్వ అనుమతులు ప్రయత్నిస్తే పొందగలరు. సామాజిక, దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. షేర్లు లాభాలనివ్వగలవు. కొత్త కాంట్రాక్టులు లీజులకు ప్రయత్నించండి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. అనవసర వ్యవహారాలలో తలదూర్చకండి.

## కర్కాటకం


పునర్వసు 4 పాదం, పుష్యం, ఆశ్లేష

ఆదాయం లోపం ఉండదు. స్థిరాస్తుల లావాదేవీలకు సిద్ధపడతారు. కుటుంబంలో స్వల్ప విభేదాలున్నా సర్దుకుంటాయి. వ్యాపారాలలో ఇబ్బందులను అధిగమిస్తారు. వాణిజ్య అగ్రిమెంట్లు, వ్యాపార భాగస్వామ్యాలు, కొత్త లీజులు ఏజెన్సీలకు ప్రయత్నించండి. అనుకున్న పనులకు ప్రయత్నాలు కలసి వస్తాయి. కొత్త వస్తువులు సమకూరుతాయి. విద్యా ప్రగతి బాగుంటుంది.

## కుంభం


ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ముఖ్య పనులందు బంధుమిత్రుల సహాయ సహకారాలుంటాయి. పనులు విజయవంతంగా జరుపుకొంటారు. పొదుపు పథకాలు చేపట్టడం, కొత్త పెట్టుబడులకు అవకాశాలు దొరుకును. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరగడం, అభివృద్ధికి అవకాశాలు దొరుకుతాయి. స్థిరాస్తులు, కొత్త వస్తువులు కొనడం జరుగుతుంది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. ఆస్తి వివాదాలు పరిష్కారము కావడం జరుగుతుంది.

## సింహం


మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

బంధుమిత్రుల సహకారం బాగుంటుంది. అనుకోని ప్రయాణాలు, కొత్తవారిని కలుసుకొనడం జరుగుతుంది. శుభకార్య ప్రయత్నాలు ఫలించవచ్చును. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరం. వృత్తి వ్యాపారాల వృద్ధికి విశేష కృషి చేస్తారు. మాట తొందరపాటు తగ్గించుకొనండి. నిలబడిపోయిన పనులు కొనసాగుతాయి. కళాక్రీడా శాస్త్ర సాంకేతిక రంగాల వారికి మంచి అవకాశాలు దొరకగలవు.

## తుల


చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

తొందరపాటు నిర్ణయాలు తీసుకోనకుండా ఇతరులతో చర్చించండి. వాహనాలు నడిపేవారు, కరెంటు యంత్రాలతో పనులు చేసేవారు జాగ్రత్తగా ఉండండి. వ్యాపార రంగాలలో అభివృద్ధి అవకాశాలు, బ్యాంకు ఋణాలు లభిస్తాయి. చేపట్టిన పనులకు ఆటంకాలు వచ్చినా ఏదో ఒక విధంగా జరుపుకొంటారు. వస్తు వాహన రిపేర్లుంటాయి. రావలసిన బాకీలు నిలబడిపోతాయి.

## మీనం


పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. ఉద్యోగులకు పనిభారం, అధికారుల సహకారం బాగుంటుంది. చేపట్టిన పనులకు ఆటంకాలుంటాయి. అందుచే టెన్షన్ పడతారు. వ్యాపారాలలో అభివృద్ధి అవకాశాలుండి ఆదాయం పెరుగుతుంది. కొన్ని అనవసర ఖర్చులుంటాయి. కొత్త ఋణాలు, ప్రభుత్వ అనుమతులు దొరకడం జరుగుతుంది.

# సకల పాపాలకు జగనే కారణం

గల్పిక

అది కైలాసం. శివపార్వతులు టీవీ ముందు కూర్చుని జెమిని ఛానెల్ పెట్టుకున్నారు. అప్పుడే నారాయణ, నారాయణ అంటూ నారదుల వారు అక్కడకు వచ్చారు. నారదుడిని చూసిన శివుడు... ఫైర్‌బ్రాండ్ మహర్షి వచ్చాడు, మా మధ్య ఏం చిచ్చుపెడతాడో ఏమో అని మనసులో శంకించసాగాడు. టీవీ ముందు కూర్చున్న శివపార్వతులనుద్దేశించి నారదుడు... అంత ఆసక్తిగా టీవీ చూస్తున్నారు, ఏం ప్రోగ్రామ్ వస్తుంది స్వామి అని అడిగాడు. 'శివ' అనే నా పేరు మీద తీసిన భక్తి చిత్రం రాబోతుంది నారదా, రేపు శివరాత్రి కదా, అందుకే ముందురోజే స్పెషల్ మూవీ వేసారని శివుడు చెప్పాడు. నారదుడికి ఎందుకో అనుమానం వచ్చింది. నాకు తెలిసి తెలుగులో ఆ పేరుతో ఎటువంటి భక్తి చిత్రం రాలేదే అని అనుకుంటూ టీవీ వైపు చూడసాగాడు. సినిమా మొదలైంది... మొదట లెటర్స్ అయిపోయాయి, చివరగా 'దర్శకత్వం రామ్‌గోపాల్‌వర్మ' అని పడింది. నారదుడికి అప్పుడు సీన్ అర్థమై... అమాయక శివయ్య, అది భక్తి సినిమా కాదు, మంచి యాక్షన్ మూవీ, నాగార్జున హీరో! రామ్‌గోపాల్‌వర్మ తీసాడు. ఈ సినిమా చూసావంటే నువ్వు కూడా సైకిల్ చైన్ పట్టుకుని తిరుగుతావ్, భూలోకవాసుల లాగే నువ్వు కూడా టీవీలో వచ్చే సినిమాలకు, చెత్త సీరియల్స్‌కు అలవాటు పడ్డట్లున్నావ్, రేపు ఎలాగూ శివరాత్రి, అలా పార్వతీ తల్లిని తీసుకుని భూలోకానికి వెళ్లిరాకూడదు, ఎంటర్‌టైన్‌మెంట్‌గా ఉంటుందని అన్నాడు. దానికి శివుడు, ఏం ఎంటర్‌టైన్‌మెంట్‌లే నారదా, భూలోకంలో ఎక్కడ చూసినా హింస, ఉగ్రవాదచర్యలు, జెఎన్‌యు, హెచ్‌సియులలో ఉగ్రవాదులకు సంతాప సభలు... ఈ ఘోరాలు చూడదానికేనా వెళ్లేది... దానికంటే ఇక్కడ ఉండడమే మేలు అని అన్నాడు. అందుకు నారదుడు... మీకు అంతవరకే తెలుసు... ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు పోండి... మస్త్ ఎంటర్‌టైన్‌మెంట్... రాజకీయాలు ఎంత కామెడీగా ఉంటాయో చూస్తారన్నారు. ఏమండీ, నాకూ ఇంట్లో వుండి బోర్ కొడుతుంది. వెళ్దామండీ అని పార్వతి అడిగింది. వెళ్లకతప్పుతుందా... వచ్చి పాయింట్ లేపింది ఎవరు నారదుల వారు, ఆయన వచ్చినప్పుడే నేను ఇలాంటివేవో ఉంటాయనుకున్నాను, అలాగే కాని ఛలో భూలోకం అని లేచాడు శివుడు.

★★★★★

అది హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు. అక్కడ ఏపి మంత్రి రావెల కిషోర్ బాబుతో పాటు మీడియా ప్రతినిధులు కూడా వున్నారు. అప్పుడే శివపార్వతులు కైలాసం నుండి అక్కడే ల్యాండయ్యారు. జైలు వద్ద చాలామంది గుమికూడి వుండడంతో అక్కడేం జరుగుతుందోనని వీళ్లు ఆగారు. ములాఖత్ సమయం కావడంతో జైలు బ్యారక్ వద్దకు మంత్రి కుమారుడు సుశీల్‌కుమార్‌ను జైలు సిబ్బంది తీసుకొచ్చారు. మంత్రి తన కొడుకు నోట్లో వేలు పెట్టాడు. అతను కొరకలేదు. తర్వాత అరటిపండు చేతికిచ్చాడు. ఆ అబ్బాయి దానిని అలాగే మింగేయబోయాడు. అప్పుడు రావెల కిషోర్ తొక్కుతీసి అరటిపండు తన కొడుక్కి తినిపించి తర్వాత మీడియాతో... మీరే చూసారుగా నా కొడుకు ఎంత అమాయకుడో, నోట్లో వేలు పెట్టినా కొరకలేడు, తొక్క తీసుకుని అరటిపండును కూడా తినడం తెలియనివాడు. ఇలాంటి అమాయకుడి మీద 'నిర్భయ' చట్టం క్రింద కేసు పెట్టారు. పాపం, మా వాడు మహిళలు నడిచి వెళ్తుంటే చూడలేడు, కారులో లిఫ్ట్ ఇద్దామనుకుంటాడు, నిన్న ఇదే చేసాడు, పుణ్యానికి పోతే పాపం ఎదురైనట్లయ్యింది మావాడి పరిస్థితి. ఓ పక్క మన పాలకులేమో మహిళలను గౌరవించాలని చెబుతారు... మరి మహిళలను గౌరవించబోయినందుకు ఇదా శిక్ష... దీని వెనుక జగన్ కుట్ర వుంది. చంద్రబాబు ఆశయ సాధన కోసం పాటుపడుతున్న మా మీద కక్ష తీర్చుకునేందుకే జగన్ ఇంత కుట్రపన్నాడు. ఈ పాపం వూరికే పోదు, ఆ జగన్‌ను దేవుడే శిక్షిస్తాడు అని శాపాలు పెట్టసాగాడు. మంచి ఎంటర్‌టైన్‌మెంట్ సీన్ అనుకుంటూ శివపార్వతులు అక్కడ్నుండి కదిలారు.

★★★★★

అమరావతిలో ముదురుదోమల శాఖ మంత్రి పి.నారాయణ కార్యాలయం. ప్రెస్‌మీట్ పెట్టి వున్నాడు. అక్కడ ఏం జరుగుతుందో చూద్దామని శివపార్వతులు ఆగారు. నారాయణ మాట్లాడుతూ... రాజధాని చుట్టుపక్కల మేం భూములు కొన్నామని ఆ జగన్ పిచ్చి వ్రాతలు రాస్తున్నాడు. మేం భూములు కొన్నచోట రాజధాని పెడితే అది మా తప్పెలా అవుతుంది. మేం సింగపూర్ కమ్ బ్యాంకాక్ కమ్ దుబాయ్ కమ్ బీజింగ్ లాంటి రాజధాని కట్టాలని నిరంతరం శ్రమపడుతున్నాం, కాని ఆ జగన్ అడుగడుగునా అడ్డుపడుతున్నాడు. మేం ఈ మూడేళ్లలో రాజధానిగాని కట్టలేకపోతే దానికి జగనే బాధ్యత వహించాల్సి వుంటుందన్నాడు. అంతలో మంత్రి ఇంట్లో పనిమనిషి వచ్చి... సార్, బాత్రూంలో నీళ్లు పోవడం లేదు, పైపులు బ్లాక్ నిలిచి పోతున్నాయంది. దానికి నారాయణ... దీనికి కూడా జగన్ కారకుడు, డ్రైనేజీ బ్లాక్ కావడం వెనుక అతని కుట్ర ఉండొచ్చని నారాయణ అన్నాడు. అంతలో పిఏ మంత్రిగారి కుక్కను తెచ్చి... సార్, ఇది మొన్నటి నుండి మొరగడం లేదు, డల్‌గా వుంటుందన్నాడు. ఆ జగనే దీనిని భయపెట్టి ఉంటాడు, కాబట్టి మొరగడం ఆపి వుంటుందని మంత్రి చెప్పాడు.

★★★★★

ఆంధ్రప్రదేశ్ శాసనసభ... దేశంలోనే అత్యంత ప్రాధాన్యతగల ఎంటర్‌టైన్‌మెంట్ స్పాట్ ఏపి అసెంబ్లీయేనని తెలుసుకుని శివపార్వతులు గ్యాలరీలో వచ్చి కూర్చున్నారు. సమావేశం మొదలైంది. వైకాపా సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్ యాదవ్‌లు రాజధాని భూముల విషయం లేవనెత్తుతూ... దీనిపై విచారణ కమిటి వేయాలని రచ్చ చేయసాగారు. అప్పుడు చంద్రబాబు ఆవేశంగా లేచి... సభలో ఈ రచ్చంతటికీ జగనే కారణం. సాక్షి పేపర్‌లో రాజధాని భూముల గురించి వ్రాయకుండా ఉంటే ఈరోజు సభ ఎంతో ప్రశాంతంగా ఉండేది. మంత్రులన్నాక భూములు కొనకుండా వుంటారా, లాక్కోకుండా ఉంటారా? ఏం, జగన్ అధికారంలోకి వచ్చుంటే వాళ్లు మునిపుంగవుల్లా ఉండేవాళ్లా? ప్రపంచంలో ఈరోజు జరిగే అనర్థాలన్నింటికి కారణం జగనే... ఐసిస్ ఆగడాలకు, ఉత్తరకొరియా హైడ్రోజన్ బాంబుకు, ఫ్రాన్స్‌లో జరిగిన ఉగ్రదాడులకు, సిరియాలో జరుగుతున్న అంతర్యుద్ధానికి కారణం జగనే అని అంటుండగా, మధ్యలో మంత్రి అచ్చెన్నాయుడు లేచి... సార్, మొన్న మా పాలెంలో 10బర్రెలు పోయాయి... వాటికి కూడా జగనే కారణమన్నాడు. చంద్రబాబు అందుకు, ఒక బర్రెలేంటి, గొర్రెలు, ఆవులు, కోళ్లు, మేకలు, ఏవి పోయినా, ఎక్కడ దొంగతనాలు జరిగినా, ఎక్కడ రేప్‌లు, మర్డర్లు జరిగినా... అన్నింటికి జగనే కారణమన్నాడు. అది విని జగన్‌తో సహా ప్రతిపక్ష ఎమ్మెల్యేలందరూ నోరు వెళ్లబెట్టగా... అసెంబ్లీ సమావేశాలు చూద్దామని వచ్చిన శివపార్వతులు... ఇలాంటి ఎంటర్‌టైన్‌మెంట్‌ను భరించడం తమ వల్ల కాదనుకుంటూ తిరిగి కైలాసానికి బయలుదేరారు.

# కల్యాణ వైభవం...!



నెల్లూరులో కెవిఆర్ విజయగా పేరుగాంచిన కలవకూరు విజయశేఖర్‌రెడ్డి - శైలజల కుమారుడు **అమితేష్‌రెడ్డి - మనీష**(హైదరాబాద్ వాస్తవ్యులు వల్లె నారాయణరెడ్డి - సుమతిల కుమార్తె)ల కల్యాణం ఫిబ్రవరి 27వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కల్యాణ మండపంలో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



నిప్పో బ్యాటరీల తయారీ సంస్థ ఇండోనేషనల్ లిమిటెడ్‌లో సిఎఫ్ఓగా పనిచేస్తున్న ఎం.శంకర్‌రెడ్డి - శివలక్ష్మిల కుమారుడు **హేమచంద్రారెడ్డి - శ్రావ్య** (శ్రీకాళహస్తి వాస్తవ్యులు వేనాటి శివరామకృష్ణారెడ్డి - జ్యోతిల కుమార్తె)ల వివాహం ఫిబ్రవరి 28వ తేదీ శ్రీకాళహస్తిలోని శివం కల్యాణ మండపంలో జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభదీవెనలు.



## కావలి కబుర్లు

# కవిత హత్యకేసును ఛేదిస్తాం

### - జిల్లా ఎస్పీ విశాల్ గున్నీ



కావలిలో హత్యకు గురైన కవిత హత్య కేసును త్వరలోనే ఛేదిస్తామని జిల్లా ఎస్పీ విశాల్ గున్నీ అన్నారు. మంగళవారం ఆయన కావలికి విచ్చేసి మోటార్‌సైకిల్‌పై పట్టణంలో పర్యటించి, పరిసరాలన్నిటినీ పరిశీలించారు. రాజీవ్‌నగర్‌లో హత్యకు గురైన కవిత నివాసాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం డిఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కావలి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేవిధంగా కవితను హత్య చేసి, మరో ముగ్గురిని తీవ్రంగా గాయపరచిన సంఘటనకు సంబంధించి వివరాలను ఆరా తీశారు. ఈ సంఘటనకు సంబంధించి ఇప్పటికే కొంత సమాచారం లభించిందన్నారు. కాగా, వేసవికాలంలో దొంగతనాలు అధికంగా జరుగుతుంటాయని, అందువల్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలన్నారు. ఎవరైనా వారి నివాసాల నుంచి బయటకు వెళ్ళేటప్పుడు పోలీసులకు ముందుగా సమాచారం ఇవ్వాలని సూచించారు. అపరిచితుల పట్ల అప్రమత్తంగా వుండి, అలాంటి వారి సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. కావలిలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వుందని, దానిని నివారించేందుకు స్థానిక పోలీసులకు తగు సూచనలు చేశామన్నారు. ఏమైనా సమస్యలు, సమాచారం వుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట ఏఎస్పీ గంగాధర్‌రావు, డిఎస్‌పి రాఘవరావు, 1వ పట్టణ సిఐ వెంకట్రావు తదితరులున్నారు.

*ఎస్పీని సన్మానించిన కందుకూరి:* జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, తొలిసారిగా కావలికి విచ్చేసిన విశాల్ గున్నీని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కందుకూరి సంస్థల ఛైర్మెన్ కందుకూరి వెంకట సత్యన్నారాయణ ఘనంగా సన్మానించారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళలు పురుషులకు ధీటుగా అన్ని రంగాల్లో రాణించాలని పురపాలక సంఘం ఇన్‌ఛార్జి ఛైర్మెన్ గుండ్లపల్లి భరత్‌కుమార్ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళలకు స్పూన్ అండ్ లెమన్, కుర్చీలాట తదితర క్రీడల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఛైర్మెన్ భరత్‌కుమార్‌తో పాటు కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు, 27, 34, 37 వార్డుల కౌన్సిలర్లు జి. శ్రీదేవి చైదరి, ఎం.విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు దప్పు వెంకటస్వామి, షాకీరా బేగం, ఆయేషా, పొదుపు మహిళలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.


## • గ్లోబల్ హెల్త్‌సిటి

# చెన్నై నుండి వస్తున్న సూపర్‌స్పెషాలిటి వైద్యులు

గ్లోబల్ హాస్పిటల్ అంటే తెలియని వారుండరు. ప్రత్యేకించి నెల్లూరీయులకు ఈ సంస్థ గురించి పరిచయమే అవసరం లేదు. ఎందుకంటే ఇది నెల్లూరీయుల సంస్థ. మన నెల్లూరీయుడైన డాక్టర్ రవీంద్రనాథ్ స్థాపించిన వైద్యాలయం. గ్లోబల్ మద్రాసు శాఖ గ్లోబల్ హెల్త్‌సిటీ నుండి ఇప్పుడు తరచూ అనేకమంది సూపర్‌స్పెషాలిటీ వైద్య నిపుణులు నెల్లూరుకు వస్తున్నారు. నెల్లూరు నగరంలోని సండేమార్కెట్‌లో వున్న గ్లోబల్ ఇన్‌ఫర్‌మేషన్ సెంటర్‌లో రోగులను పరీక్షిస్తున్నారు. నెలలో రెండు లేదా మూడు పర్యాయాలలో వివిధ విభాగాలకు చెందిన డాక్టర్లు ఈ సెంటర్‌ని సందర్శించి రోగులకు తమ సేవలు అందిస్తున్నారు.

• **డా॥ ఫణికిరణ్**

వెన్నెముక సమస్యలకు పరిష్కారం సూచించడమేకాకుండా అవసరమైతే అత్యంత చిన్న రంధ్రం(Minimally Invasive) ద్వారా శస్త్రచికిత్స చేయగలిగిన వెన్నెముక శస్త్ర చికిత్స నిపుణులు డా॥ ఫణికిరణ్ ఇక్కడ తమ సేవలు అందించడానికి తరచూ వస్తున్నారు.

• **డా॥ దీనదయాళ్**

ఎర్ర, తెల్ల రక్తకణాల సమస్యలకు, రక్తహీనత(అనీమియా) సమస్యలకు, స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్(బోన్ మేరో), సికిల్‌సెల్ అనీమియా, థాలసీమియా మరియు 18సంవత్సరములలోపు రక్త సంబంధిత వ్యాధులకు చికిత్స అందించి మందులు వాడనవసరం లేకుండా నివారించడంలో ప్రత్యేకత కల్గిన డా॥ దీనదయాళ్ కూడా ఈ సెంటర్‌ని సందర్శిస్తారు.

• **డా॥ మహేష్ సుందరం**

జీర్ణకోశ సంబంధిత మరియు గ్యాస్, ఉదర సమస్యల నివారణ కోసం ఓపన్ సర్జరీల ద్వారా కాకుండా లాప్రోస్కోపిక్ సర్జరీల ద్వారా చికిత్స అందించడమే కాకుండా పేషెంట్ త్వరితగతిన కోలుకునేలా వైద్య సేవలందించడం డా॥ మహేష్ సుందరం నైపుణ్యత.

పైన పేర్కొన్న వారితో పాటు ఇంకా పలు విభాగాల నిపుణులు నెల్లూరులోని గ్లోబల్ ఇన్‌ఫర్‌మేషన్ సెంటర్‌లో తరచూ అందుబాటులో ఉంటారు. సంప్రదించదలచిన వారు ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకోవాలి.


# ప్రజల సమస్యలపై దృష్టి సారించాలి

### - టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి అమరా



కావలి పట్టణంలో నెలకొన్న సమస్యల పట్ల జన్మభూమి కమిటీ సభ్యులు దృష్టి సారించాలని టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి అమరా వేదగిరి గుప్తా అన్నారు. ఇటీవల ఆయన కావలిలోని ఏడు లాంతర్ల సెంటర్‌లో 32, 33వార్డుల టిడిపి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరా మాట్లాడుతూ, ప్రజల సమస్యలను జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీలకు తెలియజేయాలన్నారు. తద్వారా ఆ సమస్యల పరిష్కారానికి మార్గం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఈసా వెంకట్రావు, సోమశేఖర్, కౌన్సిలర్ వి.పద్మ, నాయకులు కుమార్, రమణమ్మ, మోహన్‌రావు, శ్రీనివాసులు, వరమ్మ, ఎం.పద్మ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో

# కావలి ప్రతిభ



ఈ నెల 6న తూర్పుగోదావరి జిల్లాలోని పాలకొల్లులో జరిగిన రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో (80 కేజీల విభాగం) కావలికి చెందిన బి.సునీల్ గవాస్కర్ రెండవ ర్యాంకు సాధించి అందరి ప్రశంసలూ అందుకున్నాడు.

కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఈ నెల 8న ఆ క్రీడాకారుని అభినందిస్తూ, భవిష్యత్తులో మరింతగా రాణించి బాడీబిల్డింగ్‌లో కావలికి జాతీయ స్థాయి ఖ్యాతి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డివి పవన్‌కుమార్, అసోసియేట్ సెక్రటరీ బి.జగన్‌ల కృషిని కూడా ఆయన ప్రశంసించారు.

## విద్యార్థిని జ్ఞాపకార్థం..

# మెగా రక్తదాన శిబిరం



పిబిఆర్ విట్స్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థిని కుమారి గోపిరెడ్డి దొరసాని (సోని) అకాల మృతికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, ఆ విద్యార్థిని జ్ఞాపకార్థం సహవిద్యార్థులు బుధవారం కళాశాల ఎదుట ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. మధుకర్ పర్యవేక్షణలో షేక్ ఫైరోజ్, సుఖేష్‌రెడ్డి, గోపిరెడ్డి, మదన్, ఉమర్‌ఖాన్ సహకారంతో, కావలి రెడ్‌క్రాస్ సొసైటీవారి నిర్వహణలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించి అనేకమంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ పి.సిరెడ్డి, ప్రిన్సిపల్ డా. పరమేశ్వరరావు మాట్లాడుతూ, కుమారి దొరసాని అకాల మరణం తమనెంతో ఆవేదనకు గురిచేసిందన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం ఆమెకు నిజమైన శ్రద్ధాంజలి అన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ కావలి యూనిట్ డాక్టర్ రేవంత్, పారా మెడికల్ సిబ్బంది పాల్గొని ఎంతో శ్రమకోర్చి ఈ కార్యక్రమం నిర్వహించారు.

రక్తదాన శిబిరాన్ని నిర్వహించినందుకు కళాశాల యాజమాన్యానికి, విద్యార్థులు, అధ్యాపకులు అందరికీ రెడ్‌క్రాస్ కావలి యూనిట్ సెక్రటరీ డి.రవిప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు.

# పతకాలు సాధించిన నేతాజీ విద్యార్థులు




నెల్లూరులోని శ్రీ నేతాజీ(ఎంఎస్ఆర్) పైలట్ స్కూల్ విద్యార్థులు మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రతిభచూపి పలు మెరిట్ పతకాలను సాధించారు. ఇటీవల 9వ ఎస్ఓఎఫ్ ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఫౌండేషన్ వారు నిర్వహించిన ఈ మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో తమ స్కూల్కు చెందిన ఎం.సింధూర్ (6వ తరగతి) బంగారు పతకం, 7వ తరగతి విద్యార్థి యు.సాయిరోహిత్ వెండి పతకం, 6వ తరగతి విద్యార్థి ఏ.సాయిష్ఠ కాంశ్య పతకం సాధించారని ఆ స్కూల్ కరెస్పాండెంట్ ఎం.వి సుబ్బారెడ్డి తెలియజేశారు. అదేవిధంగా, 7వ తరగతి విద్యార్థులు సిహెచ్ మణిదీప్ బంగారు పతకం, కె. మోహిత్రెడ్డి వెండి పతకం, పి.మోహన్కృష్ణ కాంశ్యపతకం, 8వ తరగతి విద్యార్థులు సిహెచ్ నిరూప బంగారుపతకం, మోక్షజ్ఞ వెండిపతకం, వై.దయానా, కె.సుహిత కాంస్య పతకాలు సాధించారని ఆయన పేర్కొన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో శ్రీ నేతాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు వేదవతి సుబ్బారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డి.వాణి, ప్రధానోపాధ్యాయురాలు ఎన్.ప్రసన్న పాల్గొన్నారు.

# క్రీడల విజేతలకు బహుమతులు

మార్చి 8వ తేదీన మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎపిఎన్జిఓ మహిళా విభాగం వారు జిల్లాలో పనిచేస్తున్న పంచాయతీరాజ్, జిల్లా ప్రజాపరిషత్, మండల ప్రజాపరిషత్లలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న నాన్టీచింగ్ సిబ్బందికి క్రీడల పోటీలో నిర్వహించారు. విజేతలకు అదే రోజున బహుమతులు అందజేశారు. విజేతలైన వారిలో త్రోబాల్ టీమ్లలో సివి శేషమ్మ, ఎం.ఏ భారతి, ఎవిఎన్ శిరీష, జె.మీనాక్షి, వసంతకుమారి, బి.కవిత, పి.మంజులమ్మ, ఎన్.శిరీష వున్నారని పంచాయతీరాజ్ మినిస్టీరియల్ జూనియర్ అసిస్టెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షులు లక్కాకుల పెంచలయ్య తెలిపారు. అదేవిధంగా, టగ్ ఆఫ్ వార్లో బి. కవిత, 200 మీటర్ల పరుగు పందెంలో పి. అలేఖ్య బహుమతులు సాధించినవారిలో వున్నారని ఆయన పేర్కొన్నారు.

# క్యాన్సర్ నివారణకు కృషి

మహమ్మారి క్యాన్సర్ని నివారించేందుకు అందరు కలసి కృషి చేద్దామని మెడికల్ కళాశాల అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ చాట్ల నరసింహారావు పేర్కొన్నారు. నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల టీచింగ్ ఆసుపత్రిలోని ప్రసూతి విభాగంలో మంగళవారం తొలిసారిగా క్యాన్సర్ డిటెక్షన్ విభాగాన్ని, ముందస్తుగా క్యాన్సర్ని నిర్ధారించే కాల్పోస్కోప్ అనే అధునాతన పరికరాన్ని, 60రకాల రక్తపరీక్షలు ఒకేసారి చేసే నూతన పరికరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి ఆహారపు అలవాట్లు, తీసుకునే జాగ్రత్తలను బట్టి పలు రకాల క్యాన్సర్లు రాకుండా చూడవచ్చన్నారు. ప్రైవేటు వైద్యశాలల్లో లేని పరీక్షలు సైతం ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయడం సంతోషదాయకమన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి మాట్లాడుతూ ఇక్కడ ఏర్పాటు చేసిన నిర్ధారణ పరికరంతో 10ఏళ్ళ ముందే క్యాన్సర్ గురించి తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటి సభ్యులు ఒట్టూరు సంపత్రాజు, అనిల్కుమార్రెడ్డి, గిరి, డాక్టర్ రంగారావు పాల్గొన్నారు.

# కమనీయం శ్రీనివాసుని కల్యాణం



శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూధర్మ ప్రచార పరిషత్, హిందూ ధర్మ ప్రచార మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు దర్గామిట్టలోని టిటిడి కల్యాణ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం టిటిడి వేదపండితుడు వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో కమనీయంగా జరిగింది. ఉభయకర్తలుగా వేగూరు వెంకటేశ్వర్లు, పెంచలమ్మ దంపతులు వ్యవహరించారు. తొలుత పూలతో అలంకరించిన వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చి విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. మేళతాళాల మంగళవాయిద్యాలు, భక్తుల హరినామస్మరణలతో వేడుకగా శ్రీవారి కల్యాణోత్సవం జరిగింది. విశేషంగా పాల్గొన్న భక్తులకు ముత్యాల రమణమ్మ బృందం ఆధ్వర్యంలో తిరునామం దిద్దారు. టిటిడి అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారుడు గుండాల గురవయ్య ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులకు శ్రీవారి దివ్యప్రసాదం లడ్డూలను, అన్నప్రసాదంను వితరణ చేశారు. ఈ కల్యాణమహోత్సవంలో హిందూధర్మ ప్రచార మండలి ఉపాధ్యక్షులు కొండా శేఖర్రెడ్డి, కార్యదర్శి వంజివాక ధనుంజయ, ధర్మప్రచార మండలి సభ్యులు డి.నాగార్జున ఆచారి, గిరిజమ్మ, టివిఎస్ దుర్గాప్రసాద్, భానుప్రకాష్, ప్రోగ్రాం అసిస్టెంట్ డి.శివప్ప, టిడిపి జిల్లా నాయకులు మాలేపాటి సుబ్బానాయుడు, ఆర్టీసీ విశ్రాంత ఇడి పి.శేషగిరిరావు, సి.హెచ్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# హరహర మహాదేవ... శంభో శంకర

## • శైవక్షేత్రాల్లో కిటకిటలాడిన భక్తజనం

మహాశివరాత్రి సందర్భంగా నెల్లూరు జిల్లాలోని శైవక్షేత్రాలు సోమవారం శివనామస్మరణతో మార్మోగాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచే అశేష భక్తజనం పరమేశ్వరుని దర్శించుకుని సకల పాపాలను హరింపజేయాలని ప్రత్యేకపూజలు, అభిషేకాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం రాత్రి 10గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు లింగోద్భవాభిషేకాలు వైభవంగా జరిగాయి. నెల్లూరు మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వరస్వామిని నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్రెడ్డి, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, మాజీమంత్రి పనబాక లక్ష్మి, జిల్లా న్యాయమూర్తి సిహెచ్ కనకదుర్గారావు దంపతులు, తదితర ప్రముఖులు దర్శించుకున్నారు. నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి, ఉస్మాన్సాహెబ్పేటలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, దర్గామిట్టలోని శ్రీ సుందరేశ్వరస్వామి, సంతపేటలోని భ్రమరాంబ సమేత హరనాథస్వామి, వహబ్పేటలోని శ్రీ ఉమామహేశ్వర స్వామి, మూలాపేటలోని అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామిని భక్తులు దర్శించుకుని ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. నెల్లూరురూరల్ పెద్దచెరుకూరులోని బాలాత్రిపురసుందరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో నేత్రపర్వంగా విశేషపూజలు నిర్వహించారు. కల్లూరుపల్లిలోని సరస్వతి శివరామ మందిరంలో మహాశివరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కోడూరుపాడులోని శ్రీ గంగాపార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. పడారుపల్లిలోని శివాలయంలో మహాశివునికి ప్రత్యేకపూజలు వైభవంగా జరిగాయి. స్వామివారికి భక్తులు క్షీర, కొబ్బరి నీటితో అభిషేకాలు నిర్వహించారు. టిపిగూడూరు మండలంలోని కాటేపల్లి సముద్రతీరంలోని శ్రీ కామాక్షిదేవి సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు. చిట్టమూరు మండలంలోని మల్లాంలో శ్రీ



నవాబుపేట శివాలయంలో దీపారాధన చేస్తున్న మహిళలు

వళ్ళీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వాకాడు మండలంలోని వాకాడు, నెల్లిపూడి, యర్రగటపల్లి, కల్లూరు, మొలగనూరు, తిరుమూరు, వడ్డికండ్రిగ, దుగరాజపట్నం, కొండాపురం, వాలమేడు, పంట్రంగం శివాలయాల్లో సోమవారం మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. ఇందుకూరుపేటలోని కామాక్షితాయి సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానంలో జరిగిన గిన్నెభిక్ష చప్పర ఉత్సవం వైభవంగా నిర్వహించారు. వింజమూరులోని విరాట్నగర్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, నల్లగొండ్ల శ్రీ గుహమల్లేశ్వరస్వామి ఆలయం, వింజమూరు కొండవద్ద వెలసియున్న శ్రీ వింజ పరమేశ్వరి ఆలయం, తిరుమలానగర్లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ గుహమల్లేశ్వరుని ఆలయంలో మల్లిఖార్జునస్వామి ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది.

# మూలస్థానేశ్వరుని రథోత్సవం



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నెల్లూరు మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి రథోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. సూర్యగ్రహణం కారణంగా రథోత్సవం సంప్రోక్షణ, ఆలయశుద్ధి అనంతరం ఉదయం 11.30గంటలకు ప్రారంభమైంది. తొలుత ఆలయ అర్చకులు ఉత్సవ విగ్రహాలకు విశేషపూజలు నిర్వహించి రథంలో ప్రతిష్టించారు. హరహర మహాదేవ... శంభోశంకర... ఓం నమఃశివాయ అంటూ భక్తుల శివనామస్మరణలతో రథం బయలుదేరి బ్రాహ్మణవీధి, ఈఎస్ఆర్ఎం పాఠశాల వీధి, సంస్కృత పాఠశాల వీధి, అలంకార్ సెంటర్, రాజాగారి వీధి, రావిచెట్టు సెంటర్ మీదుగా దేవస్థానం చేరుకుంది. అర్చకులు బాలాజీశర్మ, శ్రీరామ కవచం కోటేశ్వరశర్మ, శ్రీశైలం భార్గవశర్మ, ధూర్జటి వేణుగోపాలశర్మల ఆధ్వర్యంలో స్వామివార్లకు స్నపనం, విశేషపూజా కార్యక్రమాలు, నిత్యహోమం, శాంతి, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఉభయకర్తలుగా ఆల్తూరు ఆదినారాయణరెడ్డి, సులోచనమ్మ దంపతులు వ్యవహరించారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్కుమార్యాదవ్, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధనరెడ్డి, దేవస్థానం పాలకమండలి మాజీఛైర్మెన్ ఆల్తూరు గిరీష్కుమార్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లీడరా? డిక్టేటరా?

(మొదటి పేజీ తరువాయి)

లోపాలను, చేస్తున్న పనుల్లో తప్పులను వేలెత్తి చూపకూడదా? ఇది నియంతృత్వమా? ప్రజాస్వామ్యమా? అమరావతి రాజధాని పెద్ద రియల్ఎస్టేట్ వ్యాపారం. ఇది అందరికీ తెలిసిందే! అగ్రరాజ్యాలు అమెరికా, జర్మనీ, చైనా, జపాన్ వంటి దేశాలే ఇప్పటికిప్పుడు 50వేల ఎకరాల భూముల్లో రాజధానులు కట్టలేవు. వాళ్లకు అంత అవసరం కూడా లేదు. వాస్తవానికి ఏపికి కూడా ఇప్పటికిప్పుడు 50వేల ఎకరాల రాజధాని అవసరం లేదు. గుంటూరులోనో, విజయవాడలోనో రేకులషెడ్లు వేసుకునైనా రాజధాని పెట్టుకోవచ్చు. రాష్ట్ర ప్రజలకు కావాల్సింది సత్యమైన పరిపాలనేగాని సింగపూర్ లాంటి రాజధాని కాదు. అధికారంలో కొచ్చాక తెలుగుదేశం నాయకులు మాత్రం అమరావతి రాజధానిని ఒక రియల్ వ్యాపార కేంద్రంగా మార్చుకున్నారు. రాజధాని ప్రాంతాన్ని ముందుగానే ఎంపిక చేసుకున్నారు. రాజధాని చుట్టుపక్కల ముందుగానే భూములు కొనుగోలు చేశారు. కొందరు నేరుగా కొనుగోలు చేయగా, మరికొందరు మంత్రులు, నేతలు బినామీల పేర్లతో పెట్టుకున్నారు. అయితే భూములు కొనడం తప్పు పట్టాల్సింది కాదు. కాని ఓపక్క పేదల భూములను ల్యాండ్ పూలింగ్ పేరుతో లాక్కుంటూ ఇంకోపక్క వీళ్లు భూములను కొనడమే ప్రశ్నిస్తున్నారు. భూములు కొనుక్కుంటే తప్పేంటని టీడీపీ నాయకులే ఎదురు ప్రశ్నిస్తున్నారు. రాజధాని రాకముందే అక్కడ భూములు కొన్నామంటున్నారు. గుంటూరు జిల్లా నాయకులు అమరావతి వద్ద భూములు కొన్నారంటే అర్థముంది, ఇతర జిల్లాల తెలుగుదేశం నాయకులు కూడా గుంటూరు జిల్లాకు పరుగులు తీసి భూములు కొన్నారంటే.. అక్కడ రాజధాని వస్తుందన్న విషయం ముందుగా తెలుసు కాబట్టే కదా! ఒకవేళ వైకాపా అధికారంలోకి వచ్చున్నా రాజధానిని రియల్ వ్యాపారంగానే చూసుండేవాళ్లు. ఏ పార్టీకి కూడా ప్రాతివత్యం బ్రాండ్ ఇవ్వలేం కదా! వైకాపా వచ్చున్నా ఆ పార్టీ నాయకులు ముందు ఇదే పని చేసుండేవాళ్లు. పరిపాలనాపరంగా తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడం కోసం ప్రతి వైఫల్యానికి జగన్ను బాధ్యుడిని చేయడం చంద్రబాబుకు, వారి నేతలకు ఒక నైజంగా మారిపోయింది. రాష్ట్రంలో ప్రతిపక్షమే లేకుండా చేయాలన్న ఒక నిరంకుశ వైఖరితో చంద్రబాబు ప్రవర్తిస్తున్నట్లు అనిపిస్తోంది.

# అపాయం!

(మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమల యాజమాన్యాలు ఉద్యోగాల్లోకి తీసుకోవాలి. జిల్లాలో అంతరిక్షకేంద్రం షార్తో పాటు పోర్టు, పరిశ్రమలు ఉన్నాయి. మనమూ తీరంలో ఉన్నాం కాబట్టి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండడం మంచిది. జిల్లా పోలీసులు ఈ దిశగా గుర్తింపు కలవారినే పరిశ్రమలలో చేర్చుకునేలా చర్యలు తీసుకోవాలి.

- సుబ్బరామిరెడ్డి శివరాత్రి సంబరం

## విశాఖ సేవలకు...

# మనవళ్ళే నా వారసులు

- రాజీవ్, అనిరుధ్‌లను తన వారసులుగా ప్రకటించిన సుబ్బరామయ్య
- హీరో కృష్ణంరాజుకు “విశ్వవిఖ్యాత నటవీర” బిరుదు ప్రదానం











***అది గంగా తీరమా.. విశాఖలోని సాగర తీరమా అర్థం కాలేదు. అది కాశీ నగరమా... విశాఖ పట్టణమా... తెలియని పరిస్థితి. కాశీ విశ్వేశ్వరుడినే సుబ్బరాముడు విశాఖ తీరానికి తెచ్చినట్లున్నాడు. విశాఖ తీరంలో మరో కైలాసాన్ని సృష్టించాడు. విశాఖకు మహాశివరాత్రి శోభనే కాదు సాక్షాత్తూ ఆ మహాశివుడినే రప్పించగలిగేంత గొప్ప ఆధ్యాత్మిక ప్రపంచాన్ని నిర్మించాడు మన సుబ్బరాముడు.***

గత 40 సంవత్సరాలుగా నిరంతరంగా విశాఖలో జరుగుతున్న ఆధ్యాత్మిక.. సాంస్కృతిక.. సేవా కార్యక్రమాలు ఆగకుండా సాగించాలన్నదే నా ఆశయం! గత 32 సంవత్సరాలుగా జరుగుతున్న మహాశివరాత్రి కుంభాభిషేకాలు ఇక ముందు కూడా చెయ్యాలనీ... ఈ పూజల వల్ల వచ్చే పుణ్యఫలాలను విశాఖ ప్రజలకు అందించాలన్నదే నా కోరిక! నా దేహంలో అణువణువునా ఈశ్వరుడు వున్నాడు! నా శరీరంలో ఉన్న ప్రతి రక్తపు బిందువు విశాఖ ప్రజల సేవకే అంకితం చేశాను.. చేస్తూనే ఉంటాను! విశాఖ ప్రజల కోసం ఎన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేశానో అని ఆలోచించను!. విశాఖలో ఎన్ని వేల మందికి సహాయం చెయ్యగలనో అన్నదే నా ఆలోచన! ఏ జన్మ అనుబంధమో... విశాఖ ప్రజలు నా కుటుంబ సభ్యులు అయిపోయారు. నా విశాఖ ప్రజల కోసం నా ఊపిరి ఉన్నంత వరకూ సేవ చేస్తాను. నేను చేసే సేవా కార్యక్రమాలు ఆగకుండా నిరంతరంగా సాగించడానికి... అమెరికాలో చదువుకున్న నా మనవళ్ళు ఇద్దరూ నాతో ఇక్కడికి వచ్చారు. విశాఖ ప్రజలకు నేనే కాదు... నా మనవళ్ళు ఇద్దరూ కూడా సేవ చేస్తాం అంటున్నారు. ఇక ముందు నా మనవళ్ళు కూడా ఈ విశాఖకు సేవ చేస్తారు. ఈ ఇద్దరిని మీరు మనసారా ఆశీర్వదించండి!...

రాజకీయాలకు, కులమతాలకు అతీతమైనది ప్రజాసేవ! నేను అజాతశత్రువుని! నన్ను ప్రేమించేవారు... ఆశీర్వదించే వారు... తప్ప నాకు శత్రువులే లేరు. నేను కూడా చాలా చిన్నవయసులోనే... విశాఖకు వచ్చాను. అలాగే నా మనవళ్ళు కూడా విశాఖకు వచ్చారు. ఇద్దరూ కేవలం నా వారసులు కాదు... నేను చేస్తున్న విశాఖ ప్రజాసంక్షేమ కార్యక్రమాలను నిరంతంగా సాగించడానికి వచ్చిన యువతరం ప్రతినిధులు! ఇద్దర్నీ మీరు ఆశీర్వదించండి... అంటూ ఆవేశంగా ప్రసంగించారు కళాబంధు... రాజ్యసభ సభ్యులు టి.సుబ్బిరామిరెడ్డి. మహాశివరాత్రి సందర్భంగా విశాఖ సముద్ర తీరంలో... మహాసముద్రంతో పోటీ పడుతున్న జనసముద్రం మధ్యలో కోటి వెయ్యిన్నొక్క శివలింగాల సాక్షిగా.. అతిరథ మహారథుల నాయకుల సమక్షంలో సముద్ర ఘోషను లెక్కచెయ్యకుండా ఓంకార నాదం చేస్తూ... ఆవేశభరితంగా 45 నిమషాల సేపు అనర్గళంగా ప్రసంగించిన సుబ్బరామిరెడ్డి ఉపన్యాసం ప్రజలను... ప్రముఖులను మంత్రముగ్ధులను చేసింది!

ఈ సభలో సుబ్బరామిరెడ్డి ఓంకారనాదానికి తోడుగా సంగీత దర్శకుడు వాసురావు జంత్ర వాయిద్య సంగీతం... ఆర్ఎస్ రాజ్ చేసిన శివలింగోద్భవ దృశ్యాలు తోడు కావడంతో... శివరాత్రినాడు నిజంగా కైలాసం నుండి మహాశివుడు దిగివచ్చాడా అనేంతగా ప్రజలు మైమరచిపోయారు! సుబ్బరామిరెడ్డి ప్రసంగం అయిన చాలాసేపటి వరకూ ప్రజల కరతాళ ధ్వనులు తప్ప మరేదీ వినరాలేదు! ఉపన్యాసం చివరలో టీఎస్సార్ ‘నేను లేకపోయినా.. ఈ కార్యక్రమాలు ఆగవు’ అన్నప్పుడు ప్రజలలో చాలా అలజడి వచ్చింది... నో... నో.. మీరే చెయ్యాలి... అంటూ కొందరు... సుబ్బరామిరెడ్డి జిందాబాద్ అంటూ మరికొందరు నినాదాలు చేశారు. మహిళల్లో చాలా మంది కన్నీళ్ళు తుడుచుకుంటూ ఆవేదన చెందడం చూసి టీఎస్సార్ అలా మాట్లాడకుండా ఉండాల్సిందని అనుకున్నారు.

సుబ్బరామిరెడ్డి ఎన్నో ఏళ్లుగా విశాఖ తీరంలో మహాశిరాత్రినాడు ఎన్నో కుంభాభిషేకాలు, అతిరుద్ర యాగాలు, చండీ హోమాలు నిర్వహించారు. ప్రకృతి విపత్తుల నుంచి ప్రజలను కాపాడేది దైవానుగ్రహం ఒక్కటే! భక్త కన్నప్ప సినిమాలో నటించిన కృష్ణంరాజు కన్నప్ప పాత్రకు ప్రాణం పోశారు! 40 ఏళ్ల క్రితం వచ్చిన ఈ సినిమా నేటికీ ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయింది అంటూ కృష్ణంరాజును ప్రశంసించారు. కృష్ణంరాజును సన్మానించాలని ఐదేళ్ళ క్రితమే ఓ నిర్ణయానికి వచ్చాను. అయితే దానికి ఆయన ఒప్పుకోలేదు. చివరకు ఈ రోజు విశాఖ నగరంలో సినీనటుడు కృష్ణంరాజుకు విశ్వవిఖ్యాత నటవీర బిరుదును ఇచ్చే అవకాశం కలిగింది అన్నారు టియస్సార్.

గతంలో విశాఖలో ప్రముఖ దర్శకులు దర్శకరత్న దాసరి నారాయణరావు, బాపు, కె.విశ్వనాథ్, కె.రాఘవేంద్రరావులను ఇదే విధంగా సత్కరించారు.

విశాఖ శ్రీ శారదపీఠాధిపతి శ్రీ స్వరూపానంద మాట్లాడుతూ... విశాఖలో సుబ్బరామిరెడ్డి చేసిన మహాయాగాలు, చండీయాగాలు, కుంభాభిషేకాల మూలంగానే ఇటీవల వచ్చిన హుద్‌హుద్ తుఫాన్ నుండి విశాఖ ప్రజలు నష్టపోకుండా బయటపడ్డారని అభినందిచారు.

హీరో కృష్ణంరాజు మాట్లాడుతూ కుంభాభిషేకాలు, యాగాలు వంటివి మనిషిలో ఆధ్యాత్మిక భావనలు పెంపొందించేందుకు దోహదపడుతాయన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చెడు అంటే భయపడేలా, మంచిని ప్రోత్సహించేందుకు ఉపకరిస్తాయి. శివరాత్రి రోజు హీరో ప్రభాస్ తండ్రి(నా సోదరుడు) మృతిచెందాడు. అందువల్ల శివరాత్రి రోజున ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనటంలేదు. కానీ సుబ్బరామిరెడ్డిపై గల గౌరవంతో ఈ కార్యక్రమానికి రావడం జరిగిందని, నేను నటించిన చిత్రాలలోని సన్నివేశాలతో కూడుకున్న కార్యక్రమం ఈ సభలో ప్రదర్శిస్తున్నప్పుడు ఆనాటి పాత జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయని చెప్పాడు.

ఆశేష జనవాహిని మధ్య జరిగిన ఈ కార్యక్రమాలు, శివరాత్రినాడు ఉదయం నుండి మర్నాడు మంగళవారం ఉదయం వరకూ... వివిధ కార్యక్రమాలు, నృత్యాలు, నాటకలతో నిర్విరామంగా కొనసాగింది. ఈ కార్యక్రమాలలో మంత్రి గంటా శ్రీనివాస రావు, శ్రీమతి కిల్లి కృపారాణి, సినీ తారలు సుమన్, రాజశేఖర్, జీవిత మరియు బాహుబలి రాణా, పరుచూరి మొదలైన వారు పాల్గొన్నారు. సంగీత కార్యక్రమంలో గాయకుడు గంగాధర్, మాళవిక, సురభి శర్వాణి, స్వాతి, చంద్రతేజ, పవన్, చరణ్, రమేశ్, భగవతి, ఆర్.కె. రాజు మరియు సుహాసిని మధుర గీతాలను పాడి భక్తులను అలరించారు. బి. విక్రంగౌడ్ నృత్యాలకు దర్శకత్వం వహించారు. మహాశివరాత్రి డ్యాన్స్ కార్యక్రమాన్ని శ్రీమతి శైలజ నిర్వహించారు. మీగడ రామలింగేశ్వరస్వామి అందించిన కాళహస్తి మహత్యం పలువురి ప్రశంసలు అందుకుంది. బి.వి.ఎ. నాయుడు దీపావళి పద్య నాటకం ప్రేక్షకుల ప్రశంసలు పొందింది. విశాఖ నాయకులు బి.భాస్కర్ రావు, పి.రమణకుమారి, రాజశేఖర్ మొదలైన వారు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాలు డి. వరదారెడ్డి పర్యవేక్షణలో ఎం.కె.రాము, కె.ధర్మారావు, వి.ఎస్.రావు, వర్మ, ఎస్.కె.బాషా నిర్వహించారు. శ్రీమతి ఎం.కె.ఆశాలత వ్యాఖ్యాతగా వ్యవహరించి పలువురి ప్రశంసలు అందుకుంది.

**కొసమెరుపు..** ఈ అభిషేకంలో భక్తులకు పాలు, నెయ్యి, నీరు, పెరుగు, తేనె వంటి పంచామృతాలను వందల కొద్దీ బిందెలతో ఉచితంగా టియస్సార్ అందజేయడం విశేషం. భగవంతుడినే కాదు, భక్తులను కూడా టిఎస్ఆర్ సేవిస్తాడనడానికి ఇదే తార్కాణం.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com